RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY
తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి | సంపుటి : 4 | సంచిక : 99 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | ఆదివారం,అక్టోబర్,18, 2026 | పేజీలు : 8 వెల : రూ.4/-
MALKAJGIRI | VOLUME : 4 | ISSUE NO : 99 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Sunday,October,18, 2026 | PAGES : 8 RS : 4 /-

ఐసీయూలో మాజీ ఉప ప్రధాని

## అద్వానీ..!



**న్యూఢిల్లీ,అక్టోబర్,17:**
భారతీయ జనతా పార్టీ సీనియర్ నేత, దేశ మాజీ ఉప ప్రధాని లాల్ కృష్ణ అద్వానీ అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఛాతిలో ఇన్ఫెక్షన్ తలెత్తడంతో ఆయన్ను శుక్రవారం సాయంత్రం ఢిల్లీలోని అపోలో ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆయన ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయూ)లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న కేంద్ర మంత్రి జేపీ నడ్డా వెంటనే ఆస్పత్రికి వెళ్లి అద్వానీని పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. శుక్రవారం సాయంత్రం 7:30 గంటల ప్రాంతంలో 98 ఏళ్ల అద్వానీని ఆస్పత్రికి తీసుకువచ్చినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు అపోలో ఆస్పత్రి హెల్త్ బులెటిన్ను విడుదల చేసింది. నూరాలజీ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ వినీత్ సూరి నేతృత్వంలోని వైద్యుల బృందం అద్వానీకి చికిత్స అందిస్తోందని, ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడగా ఉందనిస్పష్టం చేసింది. వైద్యులు ఎప్పటికప్పుడు ఆయన ఆరోగ్యాన్ని నిశితంగా పర్యవేక్షిస్తున్నారు. ఇదిలా ఉండగా.. కొద్ది రోజుల క్రితమే అద్వానీని ప్రధాని మోడీ కలిశారు. ప్రభుత్వ ప్రధాన పదవుల్లో మోడీ 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా, అక్టోబర్ 7న ఢిల్లీలోని ఆయననివాసానికి వెళ్లి ఆశీర్వాదం తీసుకున్నారు.

## ఎల్ నినో ఎఫెక్ట్:

# కరెంట్, నీళ్లు పొదుపుగా వాడాలి



- ఎల్ నినో ప్రభావంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆందోళన
- విద్యుత్, నీటిని పొదుపుగా వినియోగించాలని ప్రజలకు విజ్ఞప్తి
- రాష్ట్రంలో 20,000 మెగావాట్లకు చేరిన విద్యుత్ డిమాండ్
- గతంలో చలిగా ఉండే అక్టోబర్‌లోనూ ఇప్పుడు ఎండల తీవ్రత
- వాతావరణ మార్పుల వల్లే ఈ పరిస్థితి నెలకొందన్న భట్టి

**హైదరాబాద్,అక్టోబర్,17,తెలంగాణ దిశ :**
రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా మారిన నేపథ్యంలో, ప్రజలు విద్యుత్తు, నీటిని అత్యంత పొదుపుగా వినియోగించుకోవాలని తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సహజ వనరులను బాధ్యతాయుతంగా వినియోగించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆయన



స్పష్టం చేశారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన 'బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ అవార్డ్స్' ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, రాష్ట్రంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులపై ఆందోళనవ్యక్తం చేశారు. రాష్ట్రం లోవిద్యుత్ డిమాండ్ సుమారు 20,000 మెగావాట్లకు చేరుకుందని, పెరుగుతున్న ఉష్ణోగ్రతల ప్రభావంతో విద్యుత్ వినియోగం భారీగా పెరిగిందని వివరించారు. గతంలో అక్టోబర్, నవంబర్ నెలల్లో చలి తీవ్రత అధికంగా ఉండేదని, అయితే ప్రస్తుతం వాతావరణ మార్పుల వల్ల పరిస్థితులు పూర్తిగా భిన్నంగా మారాయని ఆయన పేర్కొన్నారు. "ఒకప్పుడు చలి నుంచి రక్షణ పొందేందు కు ప్రయత్నించేవాళ్లం, కానీ నేడు ఎండల తీవ్రత నుంచి మనల్ని మనం కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది" అని వ్యాఖ్యానించారు. వాతావరణంలో సంభవిస్తున్న ఈ అనూహ్య మార్పులే విద్యుత్, నీటి కొరతకు దారి తీస్తున్నాయని అభిప్రాయపడ్డారు.

## రాజస్థాన్‌లో ఘోర ప్రమాదం..

మినీ బస్సు ప్రమాదంలో 8 మంది మృతి



**న్యూఢిల్లీ,అక్టోబర్,17:**
రాజస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసు కుంది. కోటా జిల్లాలోని ఢిల్లీ-ముంబై ఎక్స్‌ప్రెస్‌వేపై ప్రయాణికులతో వెళ్తున్న మినీ బస్సు అదుపుతప్పి లోతైన కాలువలో పడిపోయింది. ఈ ప్రమాదంలో కనీసం ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోగా, 17 మంది గాయపడ్డారు. శనివారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. మధ్యప్రదేశ్‌కు చెందిన ఓ కుటుంబ సభ్యులు ప్రయాణిస్తున్న వాహనం ప్రమాదానికి గురైంది ప్రమాదానికి గురైన మినీ బస్సులో మధ్యప్రదేశ్‌కు చెందిన కుటుంబసభ్యులు ఉన్నారు. వీరు రాజస్థాన్‌లోని ఖాటూ శ్యామ్ ఆలయానికి వెళ్తున్నారు. ఢిల్లీ-ముంబై ఎక్స్‌ప్రెస్‌వేపై వెళ్తున్న సమయంలో మినీబస్సు అదుపుతప్పి సుమారు 15అడుగుల లోతున్న కాలువలో పడిపోయింది. వాహనంలో సుమారు 25 మంది ఉన్నట్లు సమాచారం. పోలీసులు, సహాయక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు బస్సులో చిక్కుకున్న వారిని బయటకు తీసి ఆసుపత్రులకు తరలించారు గాయపడిన వారిని కోటాలోని న్యూ మెడికల్ కాలేజీ హాస్పిటల్, ఎంబీఎస్ హాస్పిటల్‌కు తరలించారు. బస్సు అదుపుతప్పడానికి గల కారణాలు ఇంకా పూర్తిగా నిర్ధారణ కాలేదు. డ్రైవర్ నిద్రమత్తులోకి వెళ్లడం లేదా వాహనం వేగంగా ప్రయాణించడం ప్రమాదానికి కారణమై ఉండవచ్చని భావిస్తున్నారు.

## మాజీ సీఎం విజయన్ ఇంటికి నోటీసులు అతికించిన ఈడీ..



తిరువనంతపురం:
కేరళం విపక్ష నేత, మాజీ సీఎం విజయన్ ఇంటికి సమన్ల నోటీసును ఈడీ అతికించింది. సీఎంఆర్ఎల్‌తో లింకున్న మనీల్యాండరింగ్ కేసులో అక్టోబర్ 23వ తేదీన విచారణకు హాజరుకావాలని ఆ నోటీసులు తెలిపారు. వాస్తవానికి శుక్రవారమే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సమన్లు జారీ చేసింది. రాష్ట్ర పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఆయనపై కేసు బుక్ చేశారు. ఇక శనివారం ఉదయం కొచ్చికి చెందిన ఈడీ అధికారులు తిరువనంతపురంలోని బేకరీ జంక్షన్‌లో ఉన్న మాజీ సీఎం విజయన్ నివాసానికి వెళ్లారు. అయితే విజయన్‌కు సమన్లు అందాయన్న విషయాన్ని స్పష్టం చేయడంకోసమే ఆయన ఇంటికి వెళ్లి నోటీసులు అతికించినట్లు అధికారులు వెల్లడించారు. తాము వెళ్లినప్పుడు ఇంట్లో విజయన్ లేరని అధికారులు చెప్పారు. సీనియర్ సీపీఐ నేత వీ శివన్‌కుట్టి అక్కడకు చేరుకుని ఈడీ అధికారులకు సమాధానం ఇచ్చారు. ఈడీ చర్యలను శివన్‌కుట్టి తప్పుపట్టారు. కన్నూరులో జరుగుతున్న పార్టీ మీటింగ్‌లో విజయన్ ఉన్నారని, ఆయన పారిపోలేదని అన్నారు. నిందిత వ్యక్తి ఆచూకీ లేనప్పుడు ఇంటికి నోటీసులు అతికించవచ్చు కానీ, విజయన్ టూర్‌లో ఉన్న సమయంలో వచ్చి నోటీసులు అతికించడం సమంజసం కాదు అని శివన్‌కుట్టి అన్నారు.

## గోదావరి-కావేరి లింక్‌పై కుట్ర జరుగుతోంది..



### - మాజీ మంత్రి హరీష్ రావు

### మరో నీటి ఉద్యమం మొదలు పెడతాం..

**హైదరాబాద్,అక్టోబర్,17,తెలంగాణ దిశ :**
నవంబర్ 3న ఎన్‌బీడీఏ సమావేశం జరగబో తుందని ఎజెండా కూడా విడుదల అయింది. గోదావరి కావేరి లింక్‌ను ఈ ఎజెండాలో చేర్చుతూ అన్ని రాష్ట్రాలకు పంపించారు. ఈ విషయంలో కుట్ర జరుగుతుందని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 7వ తారీఖున చంద్రబాబు నాయుడు లేఖ రాశారని.. వారంలో ఎజెండాలో చేర్చుతూ అన్ని రాష్ట్రాలకు ఇన్ఫర్మేషన్ వచ్చిందన్నారు.
చంద్రబాబు లేఖ రాయగానే కేంద్రం మీటింగ్ ఏర్పాటు చేసింది. గోదావరిని చంద్రబాబు నాయుడు కబళిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంలో బీఆర్ఎస్ లేవనెత్తే వరకు మన రాష్ట్ర నేతలకు సోయి లేదని మండిపడ్డారు. గతంలో చంద్రబాబు ప్లాన్‌లను అడ్డుకున్నామని, ఇప్పుడు గోదావరి కావేరి లింక్ పేరుతో గోదావరి జలాల్ని కబళించే కుట్ర చేస్తున్నారన్నారు. ఉద్యమ సమయంలో కేసీఆర్ పదేపదే చెప్పేవారు. ఆయన చెప్పినట్లే ఇప్పుడు జరుగుతుంది. రేవంత్ రెడ్డి గురు దక్షిణ అనుకొని వదిలి పెడుతున్నాడా? అంటూ నిలదీశారు. రేవంత్‌ను ప్రజలు తరతరాల వరకు క్షమించరన్నారు. హక్కులు ఉన్నపుడే గోదావరి కృష్ణా జలాలను వదిలి వేశారు. ఇప్పుడు శాశ్వతంగా నీళ్లు రాకుండా చేస్తున్నారని మండిపడ్డారు.
నీళ్ళు పైసలు పెట్టి కొనలేమని మొన్న సీఎం అన్న మాటలను గుర్తు చేశారు. అంతటి ప్రాధాన్యత ఉన్న నీళ్లను ఎందుకు వదులు కుంటున్నారని ప్రశ్నించారు. ఎల్‌నీనో వస్తుందని తెలిసినప్పుడు దేవాదుల నీళ్ళని ఎందుకు వదిలి పెట్టావు? నువ్వు వదిలి పెడితే చంద్రబాబు నాయుడు ఒడిసి పట్టుకున్నారన్నారు.
ఆంధ్ర ప్రదేశ్‌లో వర్షపాతం కూడా మన కంటే తక్కువ నమోదు అయిందని, అయినా అక్కడ ఎలాంటి క్రాప్ హాలిడేలు ఇవ్వలేదని మాజీ మంత్రి హరీష్ రావు తెలిపారు. "మన నీళ్లను కిందకు వదిలి నందుకు ముందు క్షమాపణ చెప్పు. చంద్రబాబు నాయుడు లేఖ తెలంగాణ హక్కులకు మరణ శాసనం లాంటిది.

## తెలంగాణలో తీవ్ర కరవు, 315 మండలాల్లో కరవు ఛాయలు



- కేంద్రం తక్షణమే సాయం చేయాలని కోరిన మంత్రి తుమ్మల
- రాష్ట్రవ్యాప్తంగా 23 శాతం వర్షపాత లోటు, 13 లక్షల ఎకరాల్లో తగ్గిన సాగు
- పంట నష్టపోయిన రైతులకు రూ.1,986 కోట్ల సహాయ ప్యాకేజీ ప్రతిపాదన
- ప్రమాదకరంగా పడిపోయిన జలాశయాల నీటిమట్టాలు

**హైదరాబాద్,అక్టోబర్,17,తెలంగాణ దిశ :**
తెలంగాణలో కరవు పరిస్థితులు తీవ్ర రూపం దాల్చాయి. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షపాతం గణనీయంగా తగ్గడంతో 315 మండలాల్లో కరవు ఛాయలు అలుముకున్నాయని రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ధారించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రాన్ని తక్షణమే ఆదుకోవాలని, సూక్ష్మ సేద్యం (మైక్రో ఇరిగేషన్), మధ్యంతర పంట విత్తనాల పంపిణీకి అవసరమైన ఆర్థిక సాయం అందించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన 'ఖేత్ బచావో అభియాన్' వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని వ్యవసాయ సంక్షోభాన్ని ఆయన కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. మద్దతు ధరతో మొక్కజొన్న, జొన్న తదితర పంటలను 100 శాతం కొనుగోలు చేయాలని, ధరల మద్దతు పథకం కింద ఉన్న 25 శాతం కొనుగోలు పరిమితిని ఎత్తివేయాలని విజ్ఞప్తి చేశారు. రసాయన ఎరువుల ధరలు, సబ్సిడీలను హేతుబద్ధీకరించడంతో పాటు, వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పనలో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఇదే అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన అనధికారిక క్యాబినెట్ సమావేశంలోనూ సుదీర్ఘంగా చర్చ జరిగింది. రాష్ట్రంలోని 315 మండలాల్లో కరవు పరిస్థితులు ఉన్నాయని, వాటిలో 101 మండలాల్లో తీవ్ర కరవు, 214 మండలాల్లో ఓ మోస్తరు కరవు నెలకొందని అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. పంట నష్టపోయిన రైతులకు అండగా నిలిచేందుకు రూ. 1,986.89 కోట్లతో కూడిన సహాయ ప్యాకేజీని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. గణాంకాల ప్రకారం, జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30 మధ్య రాష్ట్రంలో సాధారణంగా 740.6 మి.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 615.5 మి.మీ. మాత్రమే నమోదైంది. అక్టోబర్ 15 నాటికి ఈ వర్షపాత లోటు 23 శాతానికి చేరింది. దీని ప్రభావంతో గత ఏడాదితో పోలిస్తే సాగు విస్తీర్ణం 13.22 లక్షల ఎకరాలు తగ్గి, 126.06 లక్షల ఎకరాలకు పరిమితమైంది. అత్యధికంగా నల్గొండ జిల్లాలో 3.58 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. మరోవైపు, రాష్ట్రంలోని ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు ప్రమాదకర స్థాయికి పడిపోయాయి. 466 టీఎంసీల పూర్తి సామర్థ్యానికి గాను ప్రస్తుతం కేవలం 209.45 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉంది.

## జమ్మూ కాశ్మీర్లో అక్రమ చొరబాటుకు యత్నం.. ఇద్దరు ఉగ్రవాదుల కాల్చివేత



**న్యూఢిల్లీ,అక్టోబర్,17:**
జమ్మూ కాశ్మీర్ నుంచి ఇండియాలోకి అక్రమంగా చొరబాటుకు యత్నించిన ఇద్దరు ఉగ్రవాదులను భద్రతా దళాలు కాల్చి చంపాయి. ఈ ఘటను శుక్రవారం అర్ధరాత్రి 3.00 గంటల తర్వాత, జమ్మూ కాశ్మీర్ కుప్వారా జిల్లాలో జరిగింది. భారత్-పాక్ సరిహద్దుఅయిన లైన్ ఆఫ్ కంట్రోల్ (ఎల్‌వోసీ) వద్ద, కెరాన్ సెక్టార్‌లోని, జగ్‌మండ్ ఏరియాలో శనివారం వేకువఝామున ముగ్గురు, నలుగురు వ్యక్తులు రహస్యంగా ఇండియావైపు రావడాన్ని భారత భద్రతా దళాలు గుర్తించాయి. ఈ ప్రాంతంలో గస్తీ నిర్వహిస్తుండగా.. ఎల్‌వోసీ నుంచి సరిహద్దు దాటి ఇండియాలోకి వచ్చేందుకు తీవ్రవాదులు ప్రయత్నించారు.
ఈ క్రమంలో భారత భద్రతా బలగాలు వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించాయి. దీంతో ఉగ్రవాదులు కూడా మన సిబ్బందిపై కాల్పులు జరిపారు. వెంటనే స్పందించిన భారత ఆర్మీ ఎదురు కాల్పులు జరిపింది. వారిని గాలిస్తూ కాల్పులు జరపడంతో ఇద్దరు తీవ్రవాదులు ప్రాణాలు కోల్పోయారు.
మిగిలిన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. అలాగే, ఈ ప్రాంతం మొత్తం కూంబింగ్ నిర్వహిస్తున్నట్లు ఆర్మీ తెలిపింది.

# మహిళల స్వయం ఉపాధికి అభయ చేయూత

- కుట్టు శిక్షణ పూర్తి చేసిన 32 మంది మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ల పంపిణీ - మహిళా సాధికారతకు నైపుణ్యాభివృద్ధి ఎంతో కీలకం







**కుషాయిగూడ, అక్టోబర్ 17, (తెలంగాణ దిశ)** :మహిళల్లో నైపుణ్యాలను పెంపొందించి, స్వయం ఉపాధి అవకాశాలను కల్పించడం ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించేలా ప్రోత్సహించడమే లక్ష్యంగా అభయా అసోసియేషన్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ విమెన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అధునాతన కుట్టు శిక్షణ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. వరల్డ్ ఎలక్ట్రోకెమ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా అందించిన ఆర్థిక సహకారంతో నెల రోజుల పాటు నిర్వహించిన ఈ శిక్షణ ముగింపు వేడుక శనివారం చక్రిపురంలోని అభయా స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో ఘనంగా జరిగింది. శిక్షణ పూర్తి చేసుకున్న 32 మంది మహిళలకు ఉచితంగా కుట్టు యంత్రాలను పంపిణీ చేయడంతో పాటు ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ఫ్రాన్స్‌కు చెందిన ఏఎస్‌బీ గ్రూప్ ఛైర్మన్ మిచెల్ హైనాట్ ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. వరల్డ్ ఎలక్ట్రోకెమ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ముఖ్య కార్యనిర్వహణ అధికారి, డైరెక్టర్ కె. రాఘవ వర్మ, ఆ సంస్థ సాంకేతిక విభాగం ఉపాధ్యక్షుడు జి. సత్యనారాయణ మూర్తి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, అభయా స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు ఇవని శేషు గౌరవ అతిథులుగా పాల్గొన్నారు.

### మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రోత్సాహం

ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ మహిళలకు వృత్తి నైపుణ్యాల్లో శిక్షణ అందించడంతో పాటు, ఉపాధి ప్రారంభించేందుకు అవసరమైన పరికరాలను సమకూర్చడం అభినందనీయమని పేర్కొన్నారు. కుట్టు యంత్రాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఇంటి నుంచే స్వయం ఉపాధి కార్యకలాపాలు చేపట్టాలని, తమ నైపుణ్యాలను ఆదాయ వనరులుగా మలుచుకోవాలని సూచించారు. ఆర్థికంగా స్వతంత్రంగా ఎదగడం ద్వారా కుటుంబ అభివృద్ధికి, సమాజ పురోగతికి తోడ్పడాలని ఆకాంక్షించారు. అభయా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు డి. ఉష మాట్లాడుతూ మహిళల నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి, ఆర్థిక స్వావలంబనకు సహకారం అందించిన వరల్డ్ ఎలక్ట్రోకెమ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. కేవలం శిక్షణకే పరిమితం కాకుండా, శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ఉచితంగా కుట్టు యంత్రాలను అందించడం ద్వారా వారు స్వయంగా ఉపాధి ప్రారంభించేందుకు అవకాశం కల్పించామని పేర్కొన్నారు. మహిళలు తమ నైపుణ్యాలపై నమ్మకంతో ముందుకు సాగి ఆర్థికంగా స్థిరపడాలని పిలుపునిచ్చారు.

### కార్యక్రమ విజయానికి బృంద సమన్వయం

నెల రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు ముగింపు వేడుక విజయవంతం కావడంలో అభయా సంస్థ బృందం కీలక పాత్ర పోషించింది. సంస్థ కార్యదర్శి సుచిత్రా రెడ్డి, సంయుక్త కార్యదర్శి అలెవేని, ప్రజాసంబంధాల అధికారి భాను కార్యక్రమ ప్రణాళిక, సమన్వయం, నిర్వహణలో విశేష కృషి చేశారు. మహిళలకు నైపుణ్య శిక్షణ అందించి, ఉపాధి అవకాశాల దిశగా నడిపించేందుకు సంస్థ చేపట్టిన ఈ కార్యక్రమం పలువురి ప్రశంసలు అందుకుంది. అభయా స్వచ్ఛంద సంస్థ మహిళలు, పిల్లలు, వృద్ధుల సంక్షేమం కోసం నైపుణ్యాభివృద్ధి, జీవనోపాధి కల్పన, విద్యా సహాయం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తోంది. మహిళలు తమ ప్రతిభను గుర్తించి, స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదిగేలా ప్రోత్సహించడమే లక్ష్యంగా సంస్థ సేవలను కొనసాగిస్తోంది. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ధ్రువ పత్రాలు, కుట్టు యంత్రాలను అందజేయడంతో కార్యక్రమం ముగిసింది. మహిళలకు నైపుణ్యాలను అందించి, కుటుంబాల ఆర్థిక అభివృద్ధికి బాటలు వేయాలనే లక్ష్యంతో ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని అతిథులు అభిప్రాయపడ్డారు.

## పాఠకులకు మెరుగైన సేవలు అందిస్తాం

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి వసుంధర



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 17, (తెలంగాణ దిశ)** :జిల్లాలోని గ్రంథాలయాలకు వచ్చే పాఠకులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడతామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి శ్రీమతి సి. వసుంధర స్పష్టం చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పలు అభివృద్ధి అంశాలపై సుదీర్ఘంగా చర్చించి, సంబంధిత ప్రతిపాదనలను ఆమోదించారు. జిల్లాలో నూతన గ్రంథాలయ భవనాల నిర్మాణం చేపట్టడం, ప్రస్తుతం ఉన్న గ్రంథాలయ భవనాలను ఆధునీకరించడం, పాఠకులకు అవసరమైన తాగునీరు, ఫర్నిచర్, పుస్తకాల ర్యాకులు తదితర మౌలిక సదుపాయాలను కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు వారు తెలిపారు. ముఖ్యంగా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువత, విద్యార్థులకు గ్రంథాలయాలను మరింత చేరువ చేయడానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు. గ్రంథాలయాల్లో చదువుకోవడానికి అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడంతో పాటు, విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, పఠన సదుపాయాలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. గ్రంథాలయాలు కేవలం పుస్తక పఠన కేంద్రాలుగానే కాకుండా విద్యార్థులు, యువత విజ్ఞానాభివృద్ధికి, పోటీ పరీక్షల్లో విజయ సాధనకు తోడ్పడే విజ్ఞాన కేంద్రాలుగా అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటామని చైర్మన్, కార్యదర్శి తెలిపారు. ఈ సమావేశంలో గ్రంథాలయ సంస్థ సభ్యులు పాల్గొని పలు అంశాలపై చర్చించారు.

# హైదరాబాద్‌లో ఎంజీ హెక్టర్ టోమాహాక్ ఈవీ జోరు..

- ఒకే రోజు 111 కార్ల డెలివరీ...! - రెండు నెలల్లోనే 10 వేల బుకింగ్స్.. ఒక్కసారి ఛార్జింగ్‌తో 517 కి.మీ. ప్రయాణం





**హైదరాబాద్, అక్టోబర్ 17, (తెలంగాణ దిశ)** :పండుగల సీజన్‌లో ఎలక్ట్రిక్ వాహనాలకు పెరుగుతున్న ఆదరణకు నిదర్శనంగా జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా హైదరాబాద్‌లో ఒకేరోజు 111 హెక్టర్ టోమాహాక్ ఈవీ వాహనాలను వినియోగదారులకు అందించింది. ఇటీవల మార్కెట్లోకి ప్రవేశపెట్టిన ఈ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీకి కేవలం రెండు నెలల్లోనే 10 వేల బుకింగ్స్ నమోదైనట్లు కంపెనీ వెల్లడించింది. హైటెక్ సిటీలోని సైబర్ గార్డెన్స్ కన్వెన్షన్ సెంటర్‌లో రామ్ ఎంజీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వినియోగదారులకు వాహనాల తాళాలను అందజేశారు. ఈ సందర్భంగా జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ వినయ్ రైనా మాట్లాడుతూ, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగంలో హైదరాబాద్ కీలక మార్కెట్‌గా ఎదుగుతోందని తెలిపారు. ఆధునిక సాంకేతికత, అనుసంధానిత సదుపాయాలు, పర్యావరణహిత ప్రయాణానికి ప్రాధాన్యమిచ్చే వాహనాలపై వినియోగదారులు ఆసక్తి చూపుతున్నారని పేర్కొన్నారు. పండుగల సమయంలో ఒకేరోజు 111 వాహనాలను డెలివరీ చేయడం ఈ ఆదరణకు నిదర్శనమని అన్నారు. కంపెనీ అభివృద్ధి చేసిన అడ్వాన్స్‌డ్ డ్రైవ్ ఆర్కిటెక్చర్ ప్లాట్‌ఫామ్ టెక్నాలజీ (అడాప్ట్) ఆధారంగా ఈ వాహనాన్ని రూపొందించారు. ఇందులో 69.2 కిలోవాట్ అవర్ సామర్థ్యం గల బ్యాటరీని అమర్చారు. ఒక్కసారి ఛార్జింగ్‌తో 517 కిలోమీటర్ల వరకు ప్రయాణించవచ్చని కంపెనీ వెల్లడించింది. ఈ వాహనంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచే వెహికల్ టు హోమ్ (వీ2హెచ్) సాంకేతికత ద్వారా వాహన బ్యాటరీ నుంచి ఇంటికి విద్యుత్ సరఫరా చేసుకునే సదుపాయం కల్పించారు. హెక్టర్ టోమాహాక్ ప్లగ్-ఇన్ హైబ్రిడ్ (పీహెచ్‌ఈవీ) వేరియంట్ పూర్తి ఇంధన ట్యాంక్, పూర్తిగా ఛార్జ్ చేసిన బ్యాటరీతో కలిపి 1,100 కిలోమీటర్లకు పైగా ప్రయాణించగలదని కంపెనీ తెలిపింది. ఇందులోని 20.5 కిలోవాట్ అవర్ బ్యాటరీతో 115 కిలోమీటర్లకు పైగా విద్యుత్ ఆధారంగా ప్రయాణించవచ్చని పేర్కొంది. ఈవీ, పీహెచ్‌ఈవీ వాహనాల మొదటి యజమానులకు బ్యాటరీపై జీవితకాల వారంటీని అందిస్తున్నట్లు వెల్లడించింది. ఈ ఎస్‌యూవీలో 15.6 అంగుళాల హెచ్‌డీ డిస్‌ప్లే, లెవల్-2 ఏడీఏఎస్ భద్రతా సాంకేతికత, 80కి పైగా అనుసంధానిత ఫీచర్లతో కూడిన ఐ-స్మార్ట్ 3.0 వ్యవస్థను అందించారు. 30కి పైగా హింగ్లిష్ వాయిస్ ఆదేశాలను అర్థం చేసుకునే జనరేటివ్ ఏఐ ఆధారిత వాయిస్ అసిస్టెంట్ మరో ప్రత్యేక ఆకర్షణ. వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా ఏడు రంగుల్లో ఈ వాహనం అందుబాటులో ఉంది. బ్యాటరీ-యాజ్-ఎ-సర్వీస్ (బీఏఏఎస్) విధానంలో ఎలక్ట్రిక్ వేరియంట్ ప్రారంభ ధర రూ.13.99 లక్షలుగా నిర్ణయించారు. దీనికి అదనంగా ప్రతి కిలోమీటరుకు రూ.4.90 బ్యాటరీ అద్దె చెల్లించాల్సి ఉంటుంది. ప్లగ్-ఇన్ హైబ్రిడ్ వేరియంట్ ప్రారంభ ధర రూ.21.79 లక్షలు కాగా, ప్రతి కిలోమీటరుకు రూ.3.20 బ్యాటరీ అద్దె వర్తిస్తుంది. రామ్ ఎంజీ సీఈఓ గుంజీత్ సింగ్ సచ్‌దేవా మాట్లాడుతూ, 111 కొత్త కుటుంబాలను ఎంజీ వాహన వినియోగదారుల సమూహంలోకి ఆహ్వానించడం ఆనందంగా ఉందన్నారు. విశాలమైన క్యాబిన్, సులభంగా ఉపయోగించగల సాంకేతిక సదుపాయాలు, ఎలక్ట్రిక్ పనితీరు కారణంగా హైదరాబాద్ వినియోగదారుల్లో ఈ వాహనంపై ఆసక్తి పెరుగుతోందని తెలిపారు. వాహనం కొనుగోలు నుంచి వినియోగం వరకు ప్రతి దశలోనూ వినియోగదారులకు అవసరమైన సహకారం అందిస్తామని పేర్కొన్నారు.

## సీనియర్ జర్నలిస్టు రఘు మృతి మీడియా రంగానికి తీరని లోటు

- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య సంతాపం



**హైదరాబాద్, అక్టోబర్ 17, (తెలంగాణ దిశ)** :సీనియర్ జర్నలిస్టు, ఆర్ఎన్ఏ న్యూస్ ఏజెన్సీ చీఫ్ ఎడిటర్ అవ్వారి రఘు అకాల మరణం పట్ల తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసింది. నాలుగు దశాబ్దాల పాటు జర్నలిజం రంగంలో విశేష సేవలందించిన రఘు మృతి మీడియా రంగానికి తీరని లోటని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య పేర్కొన్నారు. జనగామ జిల్లా బచ్చన్నపేటకు చెందిన రఘు 1986లో ఉదయం దినపత్రికలో సబ్‌ఎడిటర్‌గా తన పాత్రికేయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. అనంతరం కృష్ణాపత్రిక, వర్తమానం, నేటినిజం తదితర పత్రికల్లో బ్యూరో చీఫ్‌గా పనిచేశారు. ఆ తర్వాత టీవీ5లో చీఫ్ సబ్‌ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వహించారు. సుదీర్ఘ పాత్రికేయ జీవితంలో తనదైన ముద్ర వేసిన రఘు, జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన పలు కార్యక్రమాల్లో తమతో కలిసి పనిచేశారని సోమయ్య గుర్తుచేశారు. సౌమ్య స్వభావం కలిగిన రఘు గత నెల రోజులుగా ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతూ గచ్చిబౌలిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి తుదిశ్వాస విడిచారని తెలిపారు. రఘు మరణవార్త తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని పేర్కొంటూ, ఆయన మృతికి సంతాపం తెలియజేశారు. ఈ విషాద సమయంలో ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

# ప్రకృతి ఆరాధనకు ప్రతీక బతుకమ్మ..

- కలెక్టరేట్‌లో అంబరాన్నంటిన సంబరాలు
- సాంప్రదాయ పూల పండుగలో ఉత్సాహంగా పాల్గొన్న మహిళా అధికారులు, సిబ్బంది







**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 17, (తెలంగాణ దిశ)** :తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రకృతి ఆరాధనకు, సామాజిక ఐక్యతకు ప్రతిరూపంగా మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలతో కలెక్టరేట్ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. మహిళా అధికారులు, ఉద్యోగులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని బతుకమ్మ పాటలు పాడుతూ, కోలాటాలతో సందడి చేస్తూ వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. జిల్లా రెవెన్యూ శాఖ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా పౌరసరఫరాల శాఖ, భూగర్భ జల శాఖ, కీసర రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం సంయుక్తంగా ఈ వేడుకలను నిర్వహించాయి. వివిధ రకాల పూలతో అలంకరించిన బతుకమ్మల చుట్టూ మహిళలు వలయంగా చేరి సంప్రదాయ బతుకమ్మ పాటలు ఆలపిస్తూ వేడుకల్లో పాల్గొన్నారు. తెలంగాణ గ్రామీణ జీవన విధానం, ప్రకృతితో మానవ సంబంధాలు, మహిళల ఐక్యతను ప్రతిబింబించే బతుకమ్మ పండుగ విశిష్టతను ఈ సందర్భంగా చాటిచెప్పారు. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, కుటుంబ బంధాలకు, సామాజిక సమైక్యతకు ప్రతీకగా నిలుస్తుందని ఈ వేడుకలు మరోసారి చాటిచెప్పాయి. ప్రకృతిలో లభించే పూలను పూజిస్తూ, ప్రకృతి పరిరక్షణ ఆవశ్యకతను గుర్తుచేసే ఈ పండుగ తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. ఉద్యోగ విధులతో నిత్యం బిజీగా ఉండే మహిళా అధికారులు, సిబ్బంది సంప్రదాయ పండుగలో కలసికట్టుగా పాల్గొని ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మాలతి, ప్రొఫెసర్ చంద్రావతి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. ఆనంద్‌తో పాటు వివిధ శాఖలకు చెందిన మహిళా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొని బతుకమ్మ సంబరాలను విజయవంతం చేశారు.

## వికలాంగుల హక్కుల సాధన సమితి కరీంనగర్ జిల్లా అధ్యక్షులుగా రెండవ సారి ఓదెల నరేష్ ఎన్నిక



**కరీంనగర్, అక్టోబర్ 17, (తెలంగాణ దిశ)** :కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్శకుర్తి గ్రామానికి చెందిన ఒక నిరుపేద మధ్యతరగతి కుటుంబానికి చెందిన వికలాంగుడు ఓదెల నరేష్ రెండవ సారి తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి కరీంనగర్ జిల్లా అధ్యక్షులుగా శనివారం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రాష్ట్ర అధ్యక్షులు గుత్తికొండ కిరణ్ తెలిపారు. వికలాంగుడు ఓదెల నరేష్ 2016 నుండి ఇప్పటి వరకు అనేక రకాల సేవ కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా వికలాంగుల హక్కుల సాధన కోసం ఎన్నో పోరాటాలు నిర్వహించారు. ఉద్యమంలో భాగంగా అనేక సార్లు అరెస్ట్ అయ్యారు. వికలాంగుడు ఓదెల నరేష్ డిగ్రీ ఐటిఐ వరకు చదువుకున్నాడు. ఇప్పటికి అనేక రకాల పోటీ పరీక్షలు రాసిన ఏనాడు విజయం దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికి అయినా గుర్తించి నరేష్ కు పర్మినెంట్ ఉద్యోగం ప్రభుత్వం కల్పించాలని కోరారు.

# రేగళ్ల సతీష్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ









**కాప్రా, అక్టోబర్ 17, (తెలంగాణ దిశ)** :బీఆర్ఎస్ పార్టీ నాయకులు రేగళ్ల సతీష్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు దసరా కానుకగా బట్టల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పారిశుద్ధ్య కార్మికులకు దసరా కానుకలను పంపిణీ చేసి కేక్ కట్ చేసి సతీష్ రెడ్డి గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి రేగళ్ల సతీష్ రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసి, ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవిస్తూ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. అలాగే మొక్కలు నాటారు. రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆయన అన్నారు. సమాజ ఆరోగ్యం, పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమించే పారిశుద్ధ్య కార్మికులను గౌరవిస్తూ, వారి పట్ల ఆప్యాయతను చాటుకునేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాదూరి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, గొల్లూరి అంజయ్య, బొంతు శ్రీదేవి యాదవ్, సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి, పావని మణిపాల్ రెడ్డి, ప్రభుదాస్, పొన్నాల దేవేందర్ రెడ్డి, పలువురు స్థానిక బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపి, తెలుగుదేశం పార్టీల నాయకులు, కార్యకర్తలు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

## పుట్ట బద్దలు కొడుతున్న రావణ్...

గుంటూరు, : పవన్ కళ్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని సాగించిన విషప్రచారం, రాజ్యాంగ వ్యవస్థలపై చేసిన తీవ్ర వ్యాఖ్యల కేసులో కస్టడీలోకి తీసుకున్న జోసఫ్ రావణ్ విచారణలో నోరు విప్పినట్లు తెలుస్తోంది. తనను ముందుపెట్టి నడిపించిన అసలు సూత్రధారుల జాతకాలను, కుట్ర కోణాలను పోలీసుల ఎదుట పూసగుచ్చినట్లు వెల్లడిస్తున్నట్లు చెబుతున్నారు. సోషల్ మీడియా వేదికగా సమాజంలో అలజడులు సృష్టించేలా, ఆర్మీ కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం వెనుక ఉన్న పొలిటికల్ హ్యాండ్లర్ల వివరాలను ఆరా తీస్తున్న అధికారులకు రావణ్ సంచలన వివరాలను అందించినట్లు సమాచారం. ముఖ్యంగా జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లక్ష్యంగా సాగిన వ్యక్తిత్వ హనన కార్యక్రమాలు, దానికి అందిన ఫండింగ్ మూలాల గుట్టు ఇప్పుడు విచారణలో పూర్తిగా రట్టవుతోంది.

# సంపాదకీయం

## ట్రంప్..తిరోగమనం.

ఏదిఏమైనప్పటికీ తమ దేశం నుంచి అధిక సుంకాలను వసూలు చేస్తున్న ప్రపంచ దేశాల నుంచి అదే స్థాయిలో టారిఫ్‌లను వసూలు చేస్తామని ప్రగల్భాలు పలికిన అమెరికా అధ్యక్షుడు ఇప్పుడు మడమ తిప్పుతున్నారు. ట్రంప్ టారిఫ్‌లు కేవలం ఆర్థిక సమస్యలతోనే కాకుండా, అంతర్జాతీయ సంబంధాలపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. కెనడా, మెక్సికో, యూరోపియన్ యూనియన్ వంటి సన్నిహిత మిత్ర దేశాలు కూడా ఈసుంకాల బారిన పడ్డాయి. ఈ దేశాలు ట్రంప్ చర్యలకు ప్రతీకార చర్యలుగా అమెరికన్ ఉత్పత్తులపై సుంకాలు విధించే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ పరిస్థితి వాణిజ్య యుద్ధాలకు దారితీసి, ప్రపంచ ఆర్థిక వ్యవస్థను మరింత బలహీనపరిచే ప్రమాదం ఉందని అంటున్నారు తొలుత ప్రపంచ వ్యాప్తంగా ఏప్రిల్ 10 నుంచి అమల్లోకి రావాల్సిన ప్రతీకార సుంకాల ఆదేశాలను 90 రోజుల పాటు నిలిపివేశారు. ఆ వెంటనే టారిఫ్‌ల నుంచి 20 సెక్టార్ల ఉత్పత్తులకు మినహాయింపు కల్పించారు. ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయాలను గమనిస్తే విషయం ఇట్టే అర్థమవుతున్నది వాస్తవానికి ఇతర దేశాల నుంచి అమెరికాకు దిగుమతి అవుతున్న వస్తువులపై భారీ టారిఫ్‌లను విధించడం వల్ల తమ దేశంలో స్వదేశీ వస్తువుల కొనుగోళ్లు పుంజుకుంటాయని ట్రంప్ భావించారు. అలాగే, అమెరికాలో ఇబ్బడిముబ్బడిగా పరిశ్రమలు పుట్టుకొచ్చి, తమ పౌరులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయనేది ట్రంప్ ఆలోచన. అందుకే ముందూవెనకా ఆలోచించకుండా ప్రపంచ దేశాలపై ప్రతీకార సుంకాలను ప్రకటించేశారు. ఈ క్రమంలోనే చైనాపైనా టారిఫ్‌లు వేశారు. ట్రంప్ దెబ్బకు ఇతర దేశాలన్నీ కాళ్లబేరానికి వస్తే, చైనా మాత్రం అమెరికా అధ్యక్షుడికి దీటుగా బదులిస్తూ రావడం, దీంతో ఆ దేశంపై అమెరికా మరింత పెద్ద మొత్తంలో సుంకాలు ప్రకటిస్తూ రావడం చకచకా జరిగిపోయాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన 'అమెరికా ఫస్ట్ విధానంతో అనేకదేశాల నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై భారీ సుంకాలు(టారిఫ్‌లు) విధిస్తూ ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కలవరపెడుతున్నారు. ఈ చర్యలు అమెరికన్ ఉద్యోగాలను, స్థానిక పరిశ్రమలను కాపాడతాయని ట్రంప్ వాదిస్తున్నప్పటికీ, ఇవి గ్లోబలైజేషన్ యుగానికి ముగింపు పలుకుతున్నాయని పలు దేశాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ టారిఫ్‌లు అంతర్జాతీయ వాణిజ్యంపై తీవ్ర ప్రభావం చూపుతూ, దేశాలను స్థానిక ఉత్పత్తులపై ఆధారపడేలా మార్చుతున్నాయి. 1991లో సోవియట్ యూనియన్ పతనం తర్వాత ప్రారంభమైన గ్లోబలైజేషన్ యుగం ఇప్పుడు ముగిసినట్లేనని బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ అభిప్రాయపడ్డారు. ట్రంప్ విధించిన టారిఫ్‌లు అనేక దేశాలను తమ దేశీయ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవడానికి దారితీస్తున్నాయని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో, అమెరికా కూడా తన స్థానిక వనరులపై ఆధారపడే అవసరం ఏర్పడుతుందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. చైనా, భారత్, యూరోపియన్ యూనియన్ వంటి దేశాలు ఈ టారిఫ్‌లను ఎదుర్కొనేందుకు తమ ఆర్థిక విధానాలను సవరించుకుంటున్నాయి.ట్రంప్ తన టారిఫ్ విధానాన్ని సమర్థిస్తూ, అమెరికన్ పౌరులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలను కాపాడటమే తన లక్ష్యమని పేర్కొన్నారు. విదేశీ దిగుమతులపై అధిక సుంకాలు విధించడం ద్వారా స్థానిక తయారీ రంగాన్ని ప్రోత్సహించాలని, విదేశీ ఉత్పత్తుల ఆధిపత్యాన్ని తగ్గించాలని ఆయన భావిస్తున్నారు. అయితే, ఈ చర్యలు అమెరికన్ వినియోగదారులకు వస్తువుల ధరల పెరుగుదలకు దారితీస్తాయని, అంతర్జాతీయ వాణిజ్య సంబంధాలను దెబ్బతీస్తాయని విమర్శకులు హెచ్చరిస్తున్నారు. ఉదాహరణకు, చైనా నుంచి దిగుమతి అయ్యే ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్ విడిభాగాలపై విధించిన సుంకాలు అమెరికన్ కంపెనీల ఉత్పత్తి ఖర్చులను పెంచుతున్నాయి.రెండు దేశాల మధ్య జరిగిన సుంకాల యుద్ధం పర్యవసానంగా ప్రపంచ వ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. అమెరికా మార్కెట్లపైనా ఈ ప్రభావం కనిపించింది.అంతర్జాతీయంగా నెలకొన్న ఈ గందరగోళ పరిస్థితుల వల్ల మదుపరుల కోట్లాది సంపద ఆవిరైపోయింది. అమెరికాలో ద్రవ్యోల్బణం పెరగడంతోపాటు ఆర్థికమాంద్యం ఛాయలు కనిపించాయి. ట్రంప్ వైఖరిపై ఆయన మద్దతుదారులే బహిరంగంగా పెదవి విరిచారు. దీనికి యావత్ ప్రపంచం సాక్ష్యంగా నిలిచింది. ఇంతా జరిగిన తర్వాత ట్రంప్‌కు తత్వం బోధపడినట్టు అర్థమవుతున్నది. ప్రపంచ దేశాలు ముఖ్యంగా చైనాతో పంతానికిపోతే అమెరికాకే నష్టమన్న విషయాన్ని ట్రంప్ గ్రహించినట్టు తెలుస్తున్నది. స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్ల విషయంలో అమెరికాకు చైనా అతిపెద్ద సరఫరదారుగా ఉంది. గత ఏడాది లెక్కల ప్రకారం చైనా 88 బిలియన్ డాలర్ల విలువైన స్మార్ట్‌ఫోన్లను, కంప్యూటర్లను అమెరికాకు ఎగుమతి చేసింది. అమెరికన్లు ఉపయోగించే ప్రతి 10 స్మార్ట్‌ఫోన్లలో నాలుగు, అలాగే ప్రతి మూడు కంప్యూటర్లలో ఒకటి చైనాలో ఉత్పత్తి అయిందే.చైనాలోనే సుమారు 80 శాతం ఐఫోన్లు ఉత్పత్తవుతున్నాయి. వీటిలో 58 శాతం అమెరికాకే ఎగుమతవుతున్నాయి. దాదాపు 8 బిలియన్ డాలర్ల విలువైన ప్లాస్టిక్ కుర్చీలను చైనా నుంచే అమెరికా దిగుమతి చేసుకుంది. అలాగే, పిల్లల ఆటవస్తువులను కూడా అగ్రరాజ్యానికి పెద్దమొత్తంలో చైనా ఎగుమతి చేస్తున్నది. ఇటువంటి తరుణంలో ఆ దేశంపై పెద్ద మొత్తంలో టారిఫ్‌లు అమలు చేస్తే అంతిమంగా అమెరికన్ల జేబులకే చిల్లు పడుతుంది.ఇప్పటికిప్పుడు అమెరికాలో ఈ వస్తువుల ఉత్పత్తి సాధ్యపడదు. అందుకే ట్రంప్ టారిఫ్‌ల విషయంలో వెనక్కి తగ్గినట్టు అర్థమవుతున్నది. స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లు, చిప్‌లు, సోలార్‌సెల్, మెమోరీకార్డులు వంటి ఉత్పత్తులను టారిఫ్‌ల నుంచి అమెరికా మినహాయించింది. ఈ నిర్ణయంతో ఫెంటానిల్‌పై 20 శాతం సుంకం మినహా వేరే ఏ ఇతర సుంకాలు చైనాపై భారం మోపలేకపోయాయి.

# వికలాంగుల హక్కుల పరిరక్షణకు జీవో 34ను తక్షణమే అమలు చేయాలి

**- బ్యాక్ లాగ్ ఉద్యోగాలను భర్తీ చేయాలి.. - అనుమతులు లేని ప్రత్యేక పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి - ప్రైవేటు, ఎయిడెడ్ విద్యాసంస్థల్లో ప్రత్యేక ఉపాధ్యాయులను నియమించాలి**

హైదరాబాద్, అక్టోబర్ 17, (తెలంగాణ దిశ):వికలాంగుల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని, జీవో 34ను వెంటనే అమలు చేయడంతో పాటు వికలాంగుల కోసం కేటాయించిన ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేయాలని వికలాంగుల హక్కుల కోసం పనిచేస్తున్న ఎన్‌పీఆర్‌డీ ప్రతినిధి బృందం డిమాండ్ చేసింది. ఈ మేరకు వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్‌ను కలిసి పలు సమస్యలను వివరించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరింది. వికలాంగులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో కల్పించిన రిజర్వేషన్లకు అనుగుణంగా దీర్ఘకాలంగా ఖాళీగా ఉన్న వెనుకబడిన నియామక పోస్టులను గుర్తించి భర్తీ చేయాలని ప్రతినిధి బృందం విజ్ఞప్తి చేసింది. ప్రభుత్వ ఉత్తర్వులను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా అర్హులైన వికలాంగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని పేర్కొంది. అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఆటిజం కేంద్రాలు, ప్రత్యేక పాఠశాలలు, వినికిడి లోపం ఉన్నవారికి సేవలందించే కేంద్రాలపై అధికారులు తనిఖీలు నిర్వహించి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఎన్‌పీఆర్‌డీ ప్రతినిధులు కోరారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు నాణ్యమైన విద్య, తగిన శిక్షణ, అవసరమైన సంరక్షణ అందేలా పర్యవేక్షణను బలోపేతం చేయాలని సూచించారు. ప్రైవేటు, ప్రభుత్వ సహాయం పొందుతున్న విద్యాసంస్థల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు తగిన విద్యా సదుపాయాలు కల్పించేందుకు అర్హత కలిగిన ప్రత్యేక ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక విద్య అందుబాటులో ఉండేలా అవసరమైన సిబ్బంది నియామకాలు చేపట్టడంతో పాటు సంబంధిత విద్యాసంస్థల్లో నిబంధనల అమలును నిరంతరం పర్యవేక్షించాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో కూడా వికలాంగులకు వర్తించే రిజర్వేషన్లను నిబంధనల ప్రకారం అమలు చేయాలని ప్రతినిధి బృందం విజ్ఞప్తి చేసింది. అర్హులైన



వికలాంగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు ప్రభుత్వ రంగ సంస్థల్లో వారి హక్కులకు భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొంది. వికలాంగుల సంక్షేమానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించడంలో జాప్యం చేయకుండా, సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఎన్‌పీఆర్‌డీ ప్రతినిధులు కోరారు. వికలాంగులకు విద్య, ఉపాధి, సమాన అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ రూపొందించి, వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

# కీసర ఇన్‌స్పెక్టర్ ఆర్కపల్లి ఆంజనేయులు ఆదాయానికి మించిన ఆస్తుల కేసు

**- రూ.2.28 కోట్లకు పైగా ఆస్తులు గుర్తించిన ఏసీబీ..**
**- ఇల్లు, కార్యాలయంతో పాటు ఆరు ప్రాంతాల్లో సోదాలు**
**- రూ.7 లక్షల నగదు, 60 తులాల బంగారం స్వాధీనం..**
**- ఇళ్లు, ప్లాట్లు, వ్యవసాయ భూముల పత్రాలు లభ్యం**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 17, (తెలంగాణ దిశ)** :కీసర పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఆర్కపల్లి అంజనేయులుపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసి విస్తృతంగా సోదాలు నిర్వహించింది. ఇన్‌స్పెక్టర్ నివాసం, కార్యాలయంతో పాటు మరో నాలుగు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టిన అధికారులు, ఇప్పటివరకు రూ. 2.28 కోట్లకు పైగా ఆస్తులు ఉన్నట్లు గుర్తించినట్లు సమాచారం. సోదాల్లో రూ.7 లక్షల నగదు, 60 తులాల బంగారంతో పాటు పలు ఆస్తులకు సంబంధించిన పత్రాలను గుర్తించారు.



ఏసీబీ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో సరూర్‌నగర్, ఎల్ బి నగర్, పెరూర్, మిర్యాలగూడ ప్రాంతాల్లో ఇళ్లు, భూములు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిసింది. రెండు ప్లాట్లు, రెండు ఇళ్లు, వ్యవసాయ భూములకు సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. వీటితో పాటు మారుతి విటారా బ్రెజా కారు, గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువులను కూడా గుర్తించారు. గుర్తించిన ఆస్తుల అధికారిక విలువతో పోలిస్తే మార్కెట్ విలువ ఎక్కువగా ఉండే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నట్లు సమాచారం. నల్లగొండ జిల్లా హాలియా ప్రాంతంలో మరికొన్ని వ్యవసాయ భూములు ఉన్నట్లు విచారణలో వెల్లడైన నేపథ్యంలో, వాటి వివరాలను సేకరించే పనిలో ఏసీబీ అధికారులు నిమగ్నమైనట్లు తెలిసింది. ఆస్తుల కొనుగోలు, వాటి విలువ, ఆదాయ వనరులకు సంబంధించిన వివరాలను పరిశీలిస్తూ విచారణ కొనసాగిస్తున్నారు. ఇన్‌స్పెక్టర్ అంజనేయులు గతంలో రూ.5 లక్షల లంచం కేసులో అరెస్టయ్యారు. ప్రస్తుతం ఆయన చంచల్‌గూడ కేంద్ర కారాగారంలో ఉన్నారు. తాజా ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో భాగంగా పీటీ వారెంట్‌పై ఆయనను కోర్టులో హాజరుపరిచేందుకు ఏసీబీ అధికారులు చర్యలు చేపట్టనున్నట్లు తెలిసింది. ఇన్‌స్పెక్టర్‌కు సంబంధించిన మరిన్ని ఆస్తుల వివరాలపై విచారణ కొనసాగుతోంది. సోదాలు, ఆస్తుల మదింపు, ఆదాయ వనరుల పరిశీలన పూర్తయిన తర్వాతే కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

# కాప్రా చెరువు వద్ద సద్దుల బతుకమ్మకు సర్వం సిద్ధం...!

**- మహిళలు వేలాదిగా తరలివచ్చి వేడుకలను విజయవంతం చేయాలి**
**- బతుకమ్మ ఉత్సవాల కన్వీనర్ సుడుగు మహేందర్ రెడ్డి పిలుపు**

**కాప్రా, అక్టోబర్ 17, (తెలంగాణ దిశ)** :కాప్రా చెరువు ప్రాంగణంలో నేడు నిర్వహించనున్న సద్దుల బతుకమ్మ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించేందుకు కాప్రా చెరువు బతుకమ్మ ఉత్సవాల కన్వీనర్ సుడుగు మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కాప్రా సర్కిల్ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి బతుకమ్మ వేడుకల్లో పాల్గొని పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని నిర్వాహకులు కోరుతున్నారు. చెరువు ప్రాంగణంలో బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక నీటి కొలనులో శుభ్రమైన నీటిని నింపడంతో పాటు పరిసరాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ప్రాంగణమంతా రంగులు అద్దుతూ పెయింటింగ్ పనులు పూర్తి చేశారు. వేడుకలకు హాజరయ్యే మహిళలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా విద్యుత్ దీపాలు, సౌండ్ సిస్టం, తాగునీటి సౌకర్యం, తాత్కాలిక మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేశారు. పండుగను ప్రశాంతంగా, పద్ధతిగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లపై అధికారులు ప్రత్యేక





దృష్టి సారించారు. ఈ సందర్భంగా ఉత్సవాల కన్వీనర్ సుడుగు మహేందర్ రెడ్డి మాట్లాడుతూ సద్దుల బతుకమ్మ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీక అని పేర్కొన్నారు. పూలను అందంగా పేర్చి బతుకమ్మలను తయారు చేయడం, సంప్రదాయ పాటలు పాడుతూ బతుకమ్మ చుట్టూ ఆడిపాడటం తెలంగాణ సంస్కృతిలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉన్నాయని తెలిపారు. కాప్రా చెరువు ప్రాంగణంలో నిర్వహించనున్న ఈ వేడుకలకు మహిళలు వేలాదిగా తరలివచ్చి బతుకమ్మ సంబరాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి వేడుకల్లో పాల్గొని తెలంగాణ సంప్రదాయాల వైభవాన్ని చాటాలని కోరారు. బతుకమ్మ వేడుకలకు వచ్చే మహిళలు, ప్రజలు పరిసరాల పరిశుభ్రతను పాటిస్తూ, అధికారులకు సహకరించి పండుగను సంతోషంగా జరుపుకోవాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు సమన్వయంతో చర్యలు చేపట్టాలి

**- ప్రమాదకర ప్రాంతాల్లో భద్రతా చర్యలు ముమ్మరం చేయాలి**
**- అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్**





**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 17, (తెలంగాణ దిశ)** :జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించి, ప్రజలకు సురక్షిత ప్రయాణాన్ని అందించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆదేశించారు. శనివారం మేడ్చల్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో అమలవుతున్న రోడ్డు భద్రతా చర్యల పురోగతిని సమీక్షించి, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సమావేశంలో జిల్లా రోడ్లు, భవనాల శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్, కమిటీ సభ్య కార్యదర్శి పి. జలందర్ గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, వాటి అమలుపై నివేదికను సమర్పించారు. జిల్లాలో ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించడం, రహదారులపై సూచిక బోర్డులు ఏర్పాటు చేయడం, వేగ నియంత్రణ చర్యలు చేపట్టడం, పాదచారుల భద్రతకు ప్రాధాన్యమివ్వడం, రోడ్డు మార్గ సూచికలు, మార్కింగులు ఏర్పాటు చేయడం, వీధి దీపాల నిర్వహణ తదితర అంశాలపై అధికారులు సమగ్రంగా చర్చించారు.

రోడ్డు భద్రతకు సంబంధించి గుర్తించిన సమస్యలపై సంబంధిత శాఖలు తక్షణమే స్పందించి పరిష్కార చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ సూచించారు. ప్రమాదకర ప్రాంతాల్లో అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేయడంతోపాటు ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. నిబంధనల అమలులో నిర్లక్ష్యం వహించకుండా, ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పోలీసు, రవాణా, రోడ్లు--భవనాలు, పంచాయతీరాజ్, మున్సిపల్ పరిపాలన, జాతీయ రహదారులకు సంబంధించిన శాఖల అధికారులు, జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సభ్యుడు జైపాల్ రెడ్డి, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఎలివేటెడ్ కారిడార్లకు బ్రేక్..!

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** హైదరాబాద్ నగరం నుంచి ఉత్తర తెలంగాణ జిల్లాల వైపు వెళ్లే వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గించేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టులకు భూసేకరణ సమస్య అడ్డంకిగా మారింది. సర్కార్ నిర్ణయించిన గడువులోగా పనులు పూర్తి చేయాలంటే ఇప్పటికే నిర్మాణ పనులు వేగం పుంజుకోవాల్సి ఉండగా.. డిఫెన్స్, ప్రైవేటు భూములు పూర్తిస్థాయిలో హెచ్ఎండీఏకు అందకపోవడంతో పనులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు.సికింద్రాబాద్ ప్యారడైజ్ జంక్షన్ నుంచి ఎన్‌హెచ్–44లోని డెయిరీఫాం వైపు 5.40 కిలోమీటర్ల మేర ఒక ఎలివేటెడ్ కారిడార్, ప్యారడైజ్ జంక్షన్ నుంచి శామీర్‌పేట్ వైపు 18.5 కిలోమీటర్ల మేర మరో కారిడార్‌ను నిర్మించేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. ఉత్తర తెలంగాణ వైపు వెళ్లే ప్రధాన మార్గాల్లో ట్రాఫిక్ ఒత్తిడిని తగ్గించడం, ప్రయాణ సమయాన్ని కుదించడం ఈ ప్రాజెక్టుల ప్రధాన లక్ష్యం. అయితే రెండు కారిడార్లకూ రక్షణశాఖతో పాటు ప్రైవేటు భూములు అవసరం కావడంతో భూసేకరణ, అప్పగింత ప్రక్రియ కీలకంగా మారింది.ప్యారడైజ్ ఎన్‌హెచ్–44 డెయిరీఫాం కారిడార్ మొత్తం 5.40 కిలోమీటర్లలో 3.20 కిలోమీటర్ల మేర రక్షణశాఖ భూములపై నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఇందులో సుమారు రెండు కిలోమీటర్ల మేర భూమిని రక్షణశాఖ హెచ్ఎండీఏకు అప్పగించింది. దీంతో ఆ ప్రాంతంలో పనులు క్రమంగా వేగం పుంజుకుంటున్నాయి. ఇంకా సుమారు ఒక కిలోమీటర్ పరిధిలో రక్షణ భూముల అప్పగింత పూర్తి కావాల్సి ఉంది. ఈ కా రిడార్‌లో మరో 1.6 కిలోమీటర్ల పరిధిలో ప్రైవేటు భూములు అవసరం ఉంది. భూముల సమీకరణ ప్రక్రియ పూర్తయినప్పటికీ అవార్డు పాస్ చేయాల్సిన ప్రక్రియ మిగిలి ఉంది. మరోవైపు రక్షణశాఖ భూముల్లో రక్షణ గోడల నిర్మాణం చేపడుతున్నారు.

# డిసెంబర్‌లో కార్పొరేషన్ ఎన్నికలు!

హైదరాబాద్,తెలంగాణ దిశ : తెలంగాణలో రెండో దశ మున్సిపల్ ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. డిసెంబర్‌లో జీహెచ్ఎంసీ, వరంగల్, ఖమ్మం కార్పొరేషన్లతో పాటు ఇతర వాయిదా పడిన పురపాలక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. జీహెచ్ఎంసీని హైదరాబాద్, మల్కాజిగిరి, సైబరాబాద్‌గా పునర్వ్యవస్థీకరించడం, 'సర్' ప్రక్రియ కారణంగా ఎన్నికల ప్రక్రియ ఆలస్యమైంది. వాతావరణ పరిస్థితులు, పరిపాలన సౌలభ్యాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకోనున్నారు.తెలంగాణలో రెండో దశ మున్సిపల్ ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. డిసెంబరు నెలలో హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్లతో పాటు ఎన్నికలు వాయిదా పడిన ఇతర పురపాలక సంస్థలకు ఎన్నికలు నిర్వహించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. దీంతో పురపాలక శాఖ అధికారులు ఎన్నికల ఏర్పాట్లపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. అయితే అప్పటికి జీహెచ్ఎంసీ, వరంగల్, ఖమ్మం కార్పొరేషన్ల పదవీకాలం పూర్తికాకపోవడంతో వాటికి ఎన్నికలు నిర్వహించలేదు. కొన్ని ప్రత్యేక కారణాలతో మందమర్రి, మణుగూరు, అచ్చంపేట, నకిరేకల్, కొత్తూరు, సిద్దిపేట మున్సిపాలిటీలకు కూడా ఎన్నికలు జరగలేదు.జీహెచ్ఎంసీ పదవీకాలం ముగిసిన అనంతరం ప్రభుత్వందానిని మూడు కార్పొరేషన్లుగాపునర్వ్యవస్థీకరించింది. హైదరాబాద్‌తో పాటు శివారు ప్రాంతాలను కలుపుతూ మల్కాజిగిరి, సైబరాబాద్ కార్పొరేషన్లను ఏర్పాటు చేసింది. ఈ పునర్వ్యవస్థీకరణ కారణంగా ఎన్నికల ప్రక్రియ ఆలస్యమైనట్లు తెలుస్తోంది.ప్రస్తుతం 'సర్' ప్రక్రియ కొనసాగుతుండటంతో అధికారులు దానిపైనే ప్రధానంగా దృష్టి పెట్టారు. ఆ ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉండటంతో, ఆ తర్వాత కొంత సమయం తీసుకుని డిసెంబరులో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. వాతావరణ పరిస్థితులు, పరిపాలనా సన్నద్ధత, ప్రజలకు ఇబ్బందులు తగ్గించే అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. అయితే ఎన్నికల షెడ్యూల్‌పై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

# భారత్‌ను అస్థిర పరిచేందుకు కుట్ర..!

న్యూఢిల్లీ, : మన దేశానికి పొరుగున ఉన్న శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్‌లో జెన్‌జీ ఉద్యమాలు రెజీమ్ చేంజ్ తీసుకొచ్చాయి. భారత్‌లో కూడా అలాంటి మార్పులు కావాలనే వాదనలు వినిపిస్తున్నాయి. శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్‌లలో ప్రభుత్వ మార్పులు, తిరుగుబాటు ఉద్యమాలతో పాలనా వ్యవస్థలు బలహీనపడ్డాయి. సామాజిక అసమతుల్యత పెరిగింది. ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు సహాయక చర్యలు, అంతర్జాతీయ సహకారం సమర్థవంతంగా నిర్వహించలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. నేపాల్‌లో ఇటీవలి వరదల సమయంలో సహాయం అందించడంలో విఫలతలు కనిపించాయి. పాలనా అనుభవం, సంస్థాగత సామర్థ్యం లోపం దీనికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. అభివృద్ధి అనేది కేవలం ప్రభుత్వ మార్పుతో రాదు.. సుస్థిర వ్యవస్థలు, బాధ్యతాయుత పాలన అవసరం అని ఈ అనుభవాలు చెబుతున్నాయి.భారత్‌లో సాపేక్షంగా స్థిరమైన ప్రభుత్వం, సంస్థాగత నిర్మాణం ఉన్నాయి. అయినప్పటికీ కొన్ని వర్గాలు పాలకుల మార్పును లక్ష్యంగా పెట్టుకున్నట్లు కనిపిస్తోంది. దేశం అస్థిరపడితే ప్రాంతీయ శక్తులు, ముఖ్యంగా చైనా లాంటి దేశాలు లాభపడతాయనే అంచనాలు కొందరిలో ఉన్నట్లు చర్చలు జరుగుతున్నాయి. కొన్ని శక్తులు విదేశీ ప్రభావాలకు లోనై దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాయనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

# దివ్య మృతిపై నిష్పక్షపాత విచారణ జరపాలి...!

## శ్రీకర ఆసుపత్రి వైద్యంపై కుటుంబ సభ్యుల సందేహాలు.. - చికిత్స వివరాలు వెల్లడించాలని డిమాండ్

## ఆసుపత్రి ఎదుట న్యాయం కోసం ఆందోళన.. - నిర్లక్ష్యం తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి




**ఏఎస్ రావునగర్, అక్టోబర్ 17, (తెలంగాణ దిశ) :** డెంగ్యూ జ్వరంతో చికిత్స పొందుతూ మృతి చెందిన యాప్రాల్‌కు చెందిన గండు దివ్య (21) మృతిపై సమగ్ర, నిష్పక్షపాత విచారణ జరిపించి తమకు న్యాయం చేయాలని ఆమె కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. ఈసీఐఎల్‌లోని శ్రీకర ఆసుపత్రిలో దివ్యకు అందించిన వైద్య చికిత్స, ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేసిన విధానం, తిరిగి చేర్పించిన అనంతరం తీసుకున్న చర్యలపై పలు సందేహాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో శనివారం శ్రీకర ఆసుపత్రి ఎదుట కుటుంబ సభ్యులు న్యాయం కోరుతూ పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. దివ్య మృతికి దారితీసిన పరిస్థితులపై నిజాలు వెలుగులోకి తీసుకురావాలని కోరారు. యాప్రాల్‌కు చెందిన గండు శ్రీనివాస్ యాదవ్ కుమార్తె దివ్య బీఎస్సీ అగ్రికల్చర్ చదువుతోంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. అధిక జ్వరంతో బాధపడుతున్న ఆమెను తొలుత శ్రీకర ఆసుపత్రిలో చేర్పించగా, డెంగ్యూ జ్వరంగా నిర్ధారించి చికిత్స అందించారు. అనంతరం అక్టోబర్ 13న ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశారు. అయితే మరుసటి రోజు అక్టోబర్ 14న సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో దివ్య ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో తిరిగి అదే ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ మరింత చికిత్స అందించడం సాధ్యం కాదని వైద్యులు తెలిపినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. దీంతో మెరుగైన వైద్యం కోసం అక్టోబర్ 15న సాయంత్రం సుమారు 5 గంటలకు దివ్యను సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించారు. అక్కడ చేర్పించిన సమయంలో ఆమె రక్తంలో చక్కెర స్థాయి 10గా ఉందని, రక్తపోటును నమోదు చేయలేని పరిస్థితి ఉండటంతో పాటు రక్తంలో ఇన్ఫెక్షన్ ఉన్నట్లు వైద్యులు తెలిపారని కుటుంబ సభ్యులు వెల్లడించారు. వైద్యులు చికిత్స అందించినప్పటికీ అక్టోబర్ 16న తెల్లవారుజామున 5.30 గంటలకు గుండె ఆగిపోవడంతో దివ్య మృతి చెందినట్లు తెలిపారు.

**చికిత్స, డిశ్చార్జి తీరుపై సమాధానాలు కావాలి**

దివ్య ఆరోగ్య పరిస్థితి క్షీణించడానికి గల కారణాలేమిటి? వ్యాధి తీవ్రతను సకాలంలో గుర్తించారా? అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి తగిన చికిత్స అందించారా? డిశ్చార్జి చేసే సమయంలో ఆమె ఆరోగ్య పరిస్థితిని పూర్తిస్థాయిలో అంచనా వేశారా? ఆరోగ్యం విషమించినప్పుడు మెరుగైన వైద్యం కోసం మరో ఆసుపత్రికి తరలించే నిర్ణయం సరైన సమయంలో తీసుకున్నారా?అనే ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉందని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. శ్రీకర ఆసుపత్రిలో అందించిన చికిత్సకు సంబంధించిన వైద్య రికార్డులు, రక్త పరీక్షలనివేదికలు, ఇతర పరీక్షల వివరాలు, డిశ్చార్జి పత్రాలను సమగ్రంగా పరిశీలించాలని కోరారు. దివ్యకు అందించిన చికిత్సలో వైద్యపరమైన లోపాలు ఏమైనా ఉన్నాయా అనే అంశాన్ని నిపుణులైన వైద్యులతో స్వతంత్రంగా విచారించాలని విజ్ఞప్తి చేశారు. విచారణలో వైద్య నిర్లక్ష్యం జరిగినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**కుమార్తెను కోల్పోయిన కుటుంబానికి న్యాయం చేయాలి**

యువ వయసులోనే కుమార్తెను కోల్పోవడం తమ కుటుంబానికి తీరని విషాదమని దివ్య తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుమార్తెను తిరిగి తీసుకురాలేకపోయినా, ఆమె మృతికి దారితీసిన పరిస్థితులు ఏమిటో తెలుసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తమకు స్పష్టమైన సమాధానాలు లభించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. దివ్య మృతిపై న్యాయం జరిగేలా కుటుంబ సభ్యులకు అండగా నిలవాలని స్నేహితులు, ప్రజాస్వామ్యవాదులు, న్యాయం కోరుకునే పౌరులకు వారు విజ్ఞప్తి చేశారు. ఈ ఘటనపై సంబంధిత వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు స్పందించి సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెల్లడించాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. దివ్య మృతికి సంబంధించి కుటుంబ సభ్యులు లేవనెత్తిన సందేహాలపై స్వతంత్ర విచారణ ద్వారా వాస్తవాలు నిర్ధారించాల్సి ఉంది. వైద్యపరమైన నిర్లక్ష్యం జరిగిందనే విషయం అధికారికంగా నిర్ధారణ కాలేదు.




# వైసీపీలో పొంచి ఉన్న సంక్షోభం...



**విజయవాడ,తెలంగాణ దిశ :**పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ పేరు, అధికారిక గుర్తును కేంద్ర ఎన్నికల సంఘం స్తంభింపజేస్తూ తీసుకున్న నిర్ణయం దేశ రాజకీయాల్లో ప్రాంతీయ పార్టీల అధినేతలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. మహారాష్ట్రలో ఉద్ధవ్ ఠాక్రే చేతుల నుంచి శివసేన ఏక్‌నాథ్ షిండే చేతికి, శరద్ పవార్ పట్టు నుంచి ఎన్సీపీ అజిత్ పవార్ చేతికి ఎలాగైతే ప్రజాప్రతినిధుల సంఖ్యాబలం ఆధారంగా వెళ్లిపోయాయో.. ఇప్పుడు బెంగాల్‌లోనూ మమతా బెనర్జీపై రెబల్స్ పైచేయి సాధించి పార్టీని చేజిక్కించుకునే దశకు చేరుకున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయాలు, చట్టపరమైన పూర్వాపరాలను పరిశీలిస్తే.. శాసనసభాపక్షంలో సంఖ్యాబలం ఉన్న వర్గానికే అసలైన పార్టీగా గుర్తింపు దక్కుతోందన్నది కాదనలేని వాస్తవంగా మారింది. ఇదే సూత్రం ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లోనూ సరికొత్త చర్చకు ఆజ్యం పోస్తోంది.ప్రస్తుతం ఏపీ అసెంబ్లీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలం కేవలం 11 మంది ఎమ్మెల్యేలు మాత్రమే. భారత రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ నిబంధనల ప్రకారం.. శాసనసభాపక్షంలో మూడింట రెండొంతుల మంది ప్రజాప్రతినిధులు ఒకే తాటిపైకి వస్తే పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద ఎలాంటి అనర్హత వేటు పడదు. అంటే, మొత్తం 11 మందిలో జగన్‌ను మినహాయించి మిగిలిన 10 మంది ఎమ్మెల్యేలు గానీ, కనీసం 8 మంది సభ్యులు గానీ ఒకే మాటపై నిలబడి తిరుగుబాటు బావుటా ఎగరేస్తే చట్టపరంగా వారి సభ్యత్వాలకు ఎలాంటి ఢోకా ఉండదు. అలాంటి పరిస్థితుల్లో సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వంటి వ్యూహకర్త నాయకత్వం వహిస్తే, శాసనసభాపక్షంలో సంపూర్ణ ఆధిక్యతతో అసలైన వైఎస్సార్‌సీపీ తమదేనంటూ స్పీకర్, ఎన్నికల సంఘం ముందు వాదనలు వినిపించే సాంకేతిక వెసులుబాటు స్పష్టంగా కనిపిస్తోంది.ఒకవేళ జగన్ నియంతృత్వ ధోరణికి వ్యతిరేకంగా అసమ్మతి వర్గం బయటకు వస్తే.. పార్టీకి భావోద్వేగ పునాదులైన వైఎస్సార్ కుటుంబ సభ్యులను రంగంలోకి దించడం మరో కీలక వ్యూహం కాగలదు. జగన్ వ్యవహారశైలితో ఇప్పటికే పార్టీకి దూరమైన తల్లి వైఎస్ విజయమ్మ , రాజకీయంగా పోరాడుతున్న వైఎస్ షర్మిలను గౌరవ అధ్యక్షురాలిగానో, అధినేత్రిగానో తెరపైకి తెస్తే.. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి అభిమానులు, సంప్రదాయ ఓటుబ్యాంకును తమవైపు తిప్పుకోవడం అసమ్మతి వర్గానికి మరింత సులువవుతుంది. వైఎస్సార్ ఆశయాలు, అభిమానుల ప్రాతిపదికనే ఏర్పడిన పార్టీ కావడంతో.. కుటుంబంలో జగన్ మాత్రమే కాకుండా మిగిలిన వారికీ ఆ వారసత్వ హక్కు సహజంగానే దక్కుతుంది. ఇది పార్టీ క్యాడర్‌లో చీలికను సహజమైనదిగా మార్చేందుకు తిరుగులేని అస్త్రంగా మారుతుంది.ఎన్నికల ఓటమి తర్వాత వైఎస్ జగన్ వ్యవహరిస్తున్న ఒంటెద్దు పోకడలు, క్షేత్రస్థాయికి దూరమైన వింత రాజకీయం పార్టీ నాయకులను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. గతంలో అధికారాన్ని అనుభవించిన నేతలు నేడు కేసులు, వ్యాపార నష్టాలు, రాజకీయ భవిష్యత్తు లేని శూన్యతతో కొట్టుమిట్టాడుతున్నారు. భవిష్యత్తులో పార్టీని ఎలా ముందుకు తీసుకెళ్లాలో కార్యాచరణ లేని అధినేతను నమ్ముకుని ఉంటే తమ రాజకీయ మనుగడే ప్రశ్నార్థకమవుతుందని పలువురు ముఖ్య నేతలు భావిస్తున్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో జగన్ నీడ నుంచి బయటపడి, సొంతంగా పార్టీపై పట్టు సాధించడమో లేదా బలమైన ఫ్రంట్‌గా మారి కేంద్ర, రాష్ట్ర అధికార వర్గాలతో సంప్రదింపులు జరపడమో మాత్రమే వారి ఆస్తులను, రాజకీయ జీవితాలను కాపాడుకునే ఏకైక మార్గంగా కనిపిస్తోంది.అయితే ఈ ఫార్ములా అమలు కావడానికి ప్రధాన అవరోధం ఎమ్మెల్యేలకు ఉన్న రాజకీయ ధైర్యం. జగన్ ఆర్థిక, సామాజిక బలాల ముందు ఎదురునిలిచి బరిలోకి దిగడానికి ఎమ్మెల్యేలు ఇప్పటికీ సంశయిస్తున్నారు. కానీ, రాయలసీమలో తనకంటూ సొంత బలం, విస్తృత ఆర్థిక నెట్‌వర్క్ ఉన్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి లాంటి సీనియర్ నేత గనుక తెగించి అడుగు ముందుకు వేస్తే పరిస్థితులు శరవేగంగా తలకిందులవుతాయి. మహారాష్ట్ర, బెంగాల్ ఉదంతాలు నిరూపిస్తున్నట్లుగా.. తిరుగుబాటు చేసి సంఖ్యాబలాన్ని నిరూపించుకుంటే ఎవరి చేతికైనా పార్టీ చిక్కుతుందనే భయం జగన్‌ను వెంటాడక తప్పదు. పెద్దిరెడ్డి ఆలోచన మారితే.. వైఎస్సార్‌సీపీలో పెను భూకంపం ఖాయమని అనుకోవచ్చు.

# నకిలీ భూ పత్రాలతో స్థలం విక్రయానికి యత్నం.. ఇద్దరి అరెస్ట్

## రాంపల్లి ప్లాట్‌కు సంబంధించి నకిలీ డాక్యుమెంట్ల సృష్టి.. పత్రాలు, నోటరీ స్టాంప్ పేపర్లు, సెల్‌ఫోన్లు స్వాధీనం





**కీసర, అక్టోబర్ 17, (తెలంగాణ దిశ) :** నకిలీ భూ పత్రాలను సృష్టించి, వాటి ఆధారంగా స్థలాన్ని అక్రమంగా విక్రయించేందుకు ప్రయత్నించిన కేసులో ఇద్దరు నిందితులను కీసర పోలీసులు అరెస్ట్ చేశారు. మేడ్చల్--మల్కాజి గిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. రాంపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 402లో ఉన్న ప్లాట్ నంబర్ 34కు సంబంధించి నకిలీ పత్రాలు సృష్టించినట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది.

**సబ్ రిజిస్ట్రార్ ఫిర్యాదుతో వెలుగులోకి**

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కీసర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇంచార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న డి. సోనీకి డాక్యుమెంట్ నంబర్ 720/1982కు సంబంధించిన పత్రాలు సమర్పించారు. వాటిని పరిశీలించిన ఆమెకు అసలు రిజిస్ట్రేషన్ రికార్డుల్లోని వివరాలకు, సమర్పించిన పత్రాల్లోని వివరాలకు పొంతన లేదని గుర్తించారు. అసలు డాక్యుమెంట్ నాగారం గ్రామంలోని మరో ఆస్తికి సంబంధించిందని, అందులోని వివరాలను ఉపయోగించి రాంపల్లి గ్రామంలోని ప్లాట్‌కు సంబంధించిన నకిలీ పత్రాలు సృష్టించినట్లు ప్రాథమికంగా గుర్తించారు. దీంతో సబ్ రిజిస్ట్రార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కీసర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నకిలీ పత్రాల తయారీ, వాటి వినియోగం, తప్పుడు పత్రాల ఆధారంగా స్థలాన్ని విక్రయించేందుకు చేసిన ప్రయత్నాలకు సంబంధించిన ఆధారాలను సేకరించారు.

**ఇద్దరు నిందితుల అరెస్ట్.. వస్తువుల స్వాధీనం**

దర్యాప్తులో భాగంగా అక్టోబర్ 17న ఈ కేసులో నిందితులుగా పేర్కొన్న ఏ2 మహమ్మద్ ఖదీర్, ఏ4 రెగు రాజులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి కేసుకు సంబంధించిన పత్రాలు, నోటరీ స్టాంప్ పేపర్లు, మొబైల్ ఫోన్లు, ఇతర సంబంధిత వస్తువులను పంచుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు.

ఈ వ్యవహారంలో మరెవరైనా భాగస్వాములుగా ఉన్నారా? నకిలీ పత్రాల తయారీ వెనుక ఎవరున్నారు? వాటిని ఉపయోగించి ఆస్తి విక్రయ ప్రక్రియను ఎలా ముందుకు తీసుకెళ్లారు? అనే అంశాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. కేసుతో సంబంధం ఉన్న ఇతర నిందితుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

**స్థిరాస్తి కొనుగోలుదారులు అప్రమత్తంగా ఉండాలి**

స్థిరాస్తులు కొనుగోలు చేసే ముందు సంబంధిత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ రికార్డులు, లింక్ డాక్యుమెంట్లు, యాజమాన్య హక్కులు, ఇతర సంబంధిత పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని పోలీసులు ప్రజలకు సూచించారు. పత్రాల ప్రామాణికతపై అనుమానాలు ఉంటే నిపుణుల సలహా తీసుకోవాలని పేర్కొన్నారు. నకిలీ పత్రాలు, భూ మోసాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

# అక్రమ మద్యం రవాణాపై ఉక్కు పాదం

రాయచోటి: జిల్లాలో ప్రభుత్వ ఆదాయాన్ని పెంపొందించేందుకు అన్ని ఆదాయార్జన శాఖలు పరస్పర సమన్వయం బలితో పనిచేస్తూ నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. పన్నుల వసూళ్లలో పారదర్శకత, సమర్థత పెంచడంతో పాటు బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.మంగళవారం మదనపల్లి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎక్సైజ్, కమర్షియల్ టాక్స్, రవాణా, గనులు, అటవీ, పంచాయతీరాజ్, మున్సిపల్, రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ తదితర ఆదాయార్జన శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో శాఖల వారీగా ఆదాయ వసూళ్లు, లక్ష్యాలు, పురోగతి, బకాయిలు, భవిష్యత్ కార్యాచరణపై కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ఖజానాకు వచ్చే ప్రతి రూపాయి ఆదాయాన్ని క్రమబద్ధంగా సమీకరించేలా శాఖలు పనిచేయాలని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంతో పోల్చితే ఆదాయ వృద్ధి సాధించేలా ప్రతి శాఖ స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని ఆదేశించారు.జీఎస్టీ వసూళ్లపై ప్రత్యేక దృష్టి.కమర్షియల్ టాక్స్ శాఖపై సమీక్షిస్తూ, జిల్లాలో జీఎస్టీ వసూళ్లను మరింత మెరుగుపరచాలని కలెక్టర్ సూచించారు. ప్రస్తుతం 2026?27 ఆర్థిక సంవత్సరానికి జిల్లాకు ?278.15 కోట్ల జీఎస్టీ లక్ష్యం ఉందన్నారు. ప్రత్యేక సర్కిల్‌ను మినహాయించి నికర ఎస్‌జీఎస్టీ వసూళ్లలో మెరుగైన వృద్ధి నమోదవుతున్నట్లు తెలిపారు.మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖల పరిధిలో జరిగే పనులకు సంబంధించి బిల్లులు ప్రాసెస్ చేసే సమయంలో కాంట్రాక్టర్ల జీఎస్టీ రిజిస్ట్రేషన్ యాక్టివ్‌గా ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించాలని ఆదేశించారు. జీఎస్టీ నిబంధనలపై మండల అభివృద్ధి అధికారులు, గ్రామపంచాయతీలకు అవగాహన కల్పించి, అర్హులైన సంస్థలు రిజిస్ట్రేషన్ చేసుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు.మున్సిపల్ శాఖ నుంచి అందిన ట్రేడ్ లైసెన్స్ వివరాలను కమర్షియల్ టాక్స్ శాఖతో సమన్వయం చేసుకుని, ఇంకా జీఎస్టీ పరిధిలోకి రాని వాణిజ్య సంస్థలను గుర్తించాలని తెలిపారు. గతంలో చేపట్టిన చర్యల ఫలితంగా జిల్లాలో జీఎస్టీ రిజిస్ట్రేషన్లలో 19.06 శాతం వృద్ధి నమోదైనట్లు అధికారుల నివేదికలో పేర్కొన్నారు.జీఎస్టీ, పన్ను బకాయిల వసూళ్లకు ప్రత్యేక కార్యాచరణ.జిల్లాలో మొత్తం జీఎస్టీ బకాయిలు ?263 కోట్లు ఉండగా, అందులో వసూలు చేయదగిన బకాయిలు ?96 కోట్లుగా ఉన్నాయని అధికారులు వివరించారు. ఈ బకాయిల వసూళ్లను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# అధికారులు..మేమే లోకల్..!

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహించిన లక్కీ డ్రా కార్యక్రమం సందర్భంగా అధికారులు ప్రోటోకాల్ పాటించకపోవడంపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అలిగి వెళ్లిపోయిన సంగతి తెలిసిందే. ముఖ్య అతిథి అయిన దానం రాకుం డానే అధికారులు లక్కీ డ్రా నిర్వహించడంతో అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ క్రమంలోనే ఆ వ్యవహారంపై మీడియా సమావేశం ఏర్పాటు చేసిన దానం నాగేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పాత బస్తీ ఎమ్మెల్యేల లాగా అధికారులపై దాడి చేస్తేనే వారు మాట వింటారు అంటే అలా చేయడానికి రెడీ అని ఆయన షాకింగ్ కామెంట్స్ చేశారు.అంతేకాదు, ప్రభుత్వ అధికారులను కొట్టడం తనకు కొత్తేమీ కాదని, అది తనకు అలవాటేనని ఆయన చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. గతంలో ఒక ప్రభుత్వ అధికారిని కొట్టి జైలుకు కూడా పోయానని మీడియా ముందే ఆయన వ్యాఖ్యానించడం విశేషం. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోందని, లబ్ధిదారుల జాబితాలో తన నియోజకవర్గం వారు కాకుండా బయటివారు ఉన్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇక, హౌసింగ్ బోర్డు ఎండీ గౌతమ్ తీరుతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని ఆయన అన్నారు. ఆయన వ్యవహారంపై సీఎం




రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తానని, అసెంబ్లీలో కూడా ఈ వ్యవహారం గురించి ప్రస్తావిస్తానని చెప్పారు. రాజకీయ పార్టీలకు సంబంధం లేకుండా అధికారులు ప్రొటోకాల్ పాటించాలని అన్నారు.అధికారులు వస్తుంటారు పోతుంటారు?దానం నాగేందర్ లోకల్ అంటూ ఇడియట్ లో రవితేజ మాదిరి డైలాగ్ చెప్పారు దానం. ప్రభుత్వంపై అసంతృప్తి లేదని, తన వ్యాఖ్యలను వక్రీకరించొద్దని స్పష్టం చేశారు.

# కార్పొరేట్ దురాశ వల్లే ప్రకృతి వైపరీత్యాలు



**న్యూఢిల్లీ :** నేపాల్ జలప్రళయం సహా ఇటీవల చోటుచేసుకున్న అనేక ప్రకృతి వైపరీత్యాలకు కార్పొరేట్ కంపెనీల దురాశే ప్రధానకారణమని, అపరిమిత లాభాల కోసం పర్యావరణాన్ని విధ్వంసం చేయడం వల్లే వినాశకర పరిస్థితులు నెలకొన్నాయని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఎం) పొలిట్‌బ్యూరో ఆందోళన వ్యక్తం చేసింది.

ఈ నెల ఈ నెల 4, 5 తేదీల్లో ఢిల్లీలోని పార్టీ ప్రధానకార్యాలయం ఎకెజి భవన్‌లో పొలిట్‌బ్యూరో సమావేశమై పలు అంశాలపై చర్చించింది. వాతావరణ మార్పులతో పాటు అయోధ్య రామాలయంలో విరాళాల కుంభకోణం, ప్రభుత్వ దుర్మార్గపు చర్యలను నిరసిస్తూ సాగుతున్న పోరాటాలు, నిరసన హక్కులను పాలకులు కాలరాస్తున్న వైనం, దేశంలో నెలకొన్న ఆర్థిక సంక్షభ పరిస్థితులు, కార్పొరేట్ కంపెనీలకు, అనుయాయులకు వివిధ రూపాల్లో ప్రజల సంపదను ప్రభుత్వం దోచిపెడున్నవైనం, అలాగే పార్టీ సంస్థాగత దిద్దుబాటు చర్యలపై చర్చలు జరిపింది. సమావేశ నిర్ణయాలను వివరిస్తూ నాడు ఒక ప్రకటన విడుదల చేసింది. కార్పొరేట్ దురాశతో జరుగుతున్న పర్యావరణ విధ్వంసమే ప్రకృతి విపత్తులకు కారణమని సిపిఎం పొలిట్‌బ్యూరో పేర్కొంది. వాతావరణ మార్పులు నిదర్శనంగా నేపాల్, చైనాల్లో వరదలు భీభత్సం సృష్టించడం, వందలాది మందిని బలిగొనడంపై తీవ్ర విచారం వ్యక్తం చేసింది.

## బ్రిటిషర్లకు సింహస్వప్నం అల్లూరి

విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు గురించి తెలియని వారుండరు. మన్యం ప్రజల కోసం అలుపెరగని పోరాటం చేసి, వారి కోసం ప్రాణ త్యాగం చేసిన అమరుడైన అల్లూరి, అక్కడి ప్రజలకు దైవ సమానుడై, భారత స్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధుడుగా, మన్యం వీరుడుగా, అగ్గి పిడుగుగా ప్రసిద్ధి గాంచిన పోరాట యోధుడు సీతారామరాజు. మన్యం ప్రజల హక్కుల కోసం, స్వాతంత్ర్యం కోసం పోరాడి 27 ఏళ్ల చిన్న వయసులోనే ప్రాణ త్యాగం చేసిన విప్లవ జ్యోతి అల్లూరి. ఆయన ఒక మహోజ్వల శక్తి. ఆయన జరిపిన సాయుధ పోరాటం స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక ప్రత్యేక అధ్యాయం. మన్యం వాసుల కష్టాలను కడతేర్చటానికి, తెల్లదొరల దోపిడీని ఎదుర్కోవడానికి గిరిజనులకు అండగా నిలిచి పోరాటానికి సిద్ధ మై, చుట్టుపక్కల 30, 40 గ్రామాల ప్రజలకు రాజు నాయకుడయ్యాడు. పోలీసు స్టేషన్లపై దాడి చేసి ఆయుధాలు ఎత్తుకెళ్ళడంతో విప్లవం ప్రారంభమైంది. 1922 ఆగస్టు 19న మహారుద్రాభిషేకం చేసి చింతపల్లి పోలీసు దోపిడీకి నిశ్చయించుకొన్నారు. 1922 ఆగష్టు 22న మన్యంలో తిరుగు బాటు ప్రారంభం అయింది. రంపచోడవరం ఏజన్సీలోని చింతపల్లి పోలీసు స్టేషనుపై 300 మంది విప్లవ వీరులతో రాజు దాడిచేసి, రికార్డులను చింపివేసి, తుపాకులు, మందుగుండు సామాగ్రిని తీసుకు వెళ్ళారు. మొత్తం 11 తుపాకులు, 5 కత్తులు, 1390 తుపాకీ గుళ్ళు, 14 బాయొనెట్లు తీసుకువెళ్ళారు. ఏమేం తీసుకు వెళ్ళారో రికార్డు పుస్తకంలో రాసి, రాజు సంతకం చేసాడు. అదే ఉత్సాహంతో మరుసటి రోజే శరభన్నపాలెం వెళ్ళి, భోజనాలు చేసి ఆ రాత్రే ఆగష్టు 23న – కృష్ణదేవు పేట పోలీసు స్టేషనును ముట్టడించి, ఆయుధాలను తీసుకు వెళ్ళారు. ముందుగా పోలీసులను భయపెట్టి బయటకు పంపేశారు. 7 తుపాకులు, కొన్ని మందుగుండు పెట్టెలు మాత్రం లభించాయి. ఆగష్టు 24న – వరుసగా మూడవ రోజు – రాజవొమ్మంగి పోలీసు స్టేషనుపై దాడి చేసారు. అయితే ఈసారి పోలీసుల నుండి కొద్దిపాటి ప్రతిఘటన ఎదురైంది. అక్కడ ఆయుధాలు దోచుకోవడమే కాక, అక్కడ బందీగా ఉన్న వీరయ్య దొరను కూడా విడిపించారు. ఈ మూడు దాడులలోను మొత్తం 26 తుపాకులు, 2500కు పైగా మందుగుండు సామాగ్రి వీరికి వశమయ్యాయి. రామరాజు పోరాటంలో అత్యంత సాహసోపేతమైనది అడ్డతీగల పోలీసు స్టేషనుపై అక్టోబర్ 15న జరిపిన దాడి. మొదటి దాడులవలె కాక ముందే సమాచారం ఇచ్చి మరీ చేసిన దాడి ఇది. అక్టోబర్ 19న రంపచోడవరం స్టేషనును పట్టపగలే ముట్టడించారు. 4మాసాల విరామం తర్వాత1923 ఏప్రిల్ 17న రాజు కొద్దిమంది అనుచరులతో అన్నవరంలో ప్రత్యక్షమయ్యాడు. రాజు బృందం స్టేషనుకు వెళ్ళారు. విప్లవకారులు 1923 జూన్ 10న ధారకొండ, కొండకంబేరు మీదుగా మల్కనగిరి వెళ్ళి పోలీసు స్టేషను, ట్రెజరీపై దాడి చేసారు .2-9-1923న రామవరం ప్రాంతానికి కమాండర్‌గా ఉన్న అండర్‌వుడ్ సైనికులకు, మన్యం వీరులకు భీకరమైన పోరాటం జరిగింది. సెప్టెంబర్ లో రాజు ముఖ్య అనుచరుడైన గాము మల్లుదొర పోలీసులకు దొరికి పోయాడు. సెప్టెంబరు 22న విప్లవ కారులు పాడేరు పోలీస్ స్టేషన్‌పై దాడి చేశారు. అక్టోబరు 26న గూడెం సైనిక స్థావరంపై దాడి చేశారు. మన్యం ప్రజలు ఎన్ని బాధలు పడుతున్నారో వివరించి, వారికి ఈ బాధలనుండి విముక్తి ప్రసాదించడానికి తాను లొంగి పోవాలని నిశ్చయించు కున్నట్లు చెప్పాడు. తనను ప్రభుత్వానికి పట్టి ఇచ్చినవారికి పదివేల రూపాయల బహుమతి లభిస్తుందని, కనుక తనను ప్రభుత్వానికి పట్టి ఇమ్మని కోరాడు. కాని తాను అటువంటి నీచమైన పని చేయ జాలనని మునసబు తిరస్కరించాడు. తరువాత,1924 మే 7న కొయ్యూరు గ్రామ సమీపం నుండి, ఒక పశువుల కాపరి ద్వారా తనున్న చోటును పోలీసులకు కబురు పంపాడట. ఏటి ఒడ్డున స్నానం చేస్తూ ఉండగా పోలీసులు చుట్టుముట్టి రాజును బంధించారు. కొయ్యూరులో విడిది చేసి ఉన్న మేజర్ గుడాల్ వద్ద రాజును హాజరు పరిచారు.

## బద్దలైన అగ్నిపర్వతం ఇండోనేసియాలో ప్రకృతి విపత్తు



ఇండోనేసియాను మరోసారి ప్రకృతి విపత్తు భయాందోళనకు గురిచేస్తోంది. జావా, సుమత్రా దీవుల మధ్య ఉన్న సుండా జలసంధిలోని అనక్ క్రాకటౌ అగ్నిపర్వతం తెల్లవా రుజామున భారీగా విస్ఫోటనం చెందింది. అగ్ని పర్వతం నుంచి వెలువడిన దట్టమైన పొగ, బూడిద ఆకాశాన్ని కమ్మేశాయి. బూడిద మేఘాలు ఏకంగా 50 వేల అడుగుల ఎత్తుకు ఎగసిపడటంతో జకార్తా సహా పలు ప్రాంతాలపై ప్రభావం పడింది. దీంతో అప్రమత్తమైన అధికారులు విమాన రాకపోక లపై ఆంక్షలు విధించారు. ఇండోనేసియా జియో లాజికల్ ఏజెన్సీ ప్రకారం, అనక్ క్రాకటౌ అగ్ని పర్వతం శుక్రవారం నుంచే క్రియాశీలత సంకేతాలను చూపించింది. తెల్లవారు జామున 3.53 గంటలకు సుమారు 30 సెకన్ల పాటు విస్ఫో టనం సంభవించింది. అగ్నిపర్వతం వద్ద లావా జ్వాలలు ఎగసిపడుతున్న దృశ్యాలను అక్కడ ఏర్పా టు చేసిన క్లోజ్డ్- సర్క్యూట్ కెమెరాలు రికార్డు చేశాయి.

విస్ఫోటనం తీవ్రంగా ఉన్నప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు. ప్రజల ను పెద్దఎత్తున తరలిం చాల్సిన పరిస్థితి కూడా ఏర్ప డలేదు. అగ్నిపర్వ తానికి సమీపంలోని జనావా సాలు 16 కిలోమీటర్లకు పైగా దూరంలో ఉండటం తో తక్షణ ముప్పు తక్కువగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. అనక్ క్రాకటౌ క్రియాశీల బిలం నుంచి కనీసం మూడు కిలోమీటర్ల దూరంలో ఉండాలని అధికారులు స్థానికులు, పర్యాటకులను హెచ్చరించారు. అగ్నిపర్వత కార్యకలాపాలు మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జకార్తాతో పాటు సుమత్రా ద్వీపంలోని లాంపుంగ్ ప్రావిన్స్ లోని కొన్ని ప్రాంతాలకు బూడిద వ్యాపించింది. బాంటెన్, పశ్చిమ జావా ప్రాంతాలపై కూడా బూడిద మేఘాల ప్రభావం కనిపించింది. గాలుల దిశకు అనుగుణం గా బూడిద మేఘాలు మరిన్ని ప్రాంతాలకు విస్తరించే అవకాశం ఉండటంతో అధికారులు పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నారు.

## బిజెపిని ఓడించడమే లక్ష్యం సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ

**న్యూఢిల్లీ :** రానున్న ఉత్తరప్రదేశ్, పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి, సంఘ్‌పరివార్‌ను ఓడించడమే సిపిఎం లక్ష్యమని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ స్పష్టం చేశారు. జంతర్‌మంతర్ విద్యార్థి ఉద్యమంతో పాటు దేశవ్యాప్తంగా జరుగుతున్న ప్రజా ఉద్యమాల ప్రభావం రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కనిపిస్తుందని ఆయన తెలిపారు.

సిపిఎం కేంద్ర కార్యాలయం (ఎకెజి భవన్)లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంఎ బేబీ మాట్లాడారు. రెండు రోజుల పాటు జరిగిన సిపిఎం పొలిట్ బ్యూరో సమావేశం వివరాలను వెల్లడించారు. బిజెపి, సంఘ్‌పరివార్ శక్తులను ఓడించేందుకు ప్రజాస్వామ్య, లౌకిక శక్తుల ఐక్యతను బలోపేతం చేయడమే పార్టీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. పంజాబ్‌లో బిజెపిని ఓడించే అవకాశాలు అత్యధికంగా ఉన్న అభ్యర్థికి సిపిఎం మద్దతు ఇస్తుందని తెలిపారు.

ఈ అంశంపై పంజాబ్ రాష్ట్ర కమిటీ ఇప్పటికే సమగ్రంగా చర్చించిందని, అవసరమైన నిర్ణయాలు తీసుకుంటుందని చెప్పారు. ఉత్తరప్రదేశ్‌లోనూ బిజెపిని ఓడించేందుకు సిపిఎం పనిచేస్తుందని తెలిపారు. మోడీ ప్రభుత్వం, సంఘ్‌పరివార్ కొంతకాలంగా దేశంలో సృష్టిస్తున్న భయానక వాతావరణాన్ని జంతర్‌మంతర్ విద్యార్థి ఉద్యమం బద్దలు కొట్టిందని



ఆయన అన్నారు. ఎలాంటి భయానికీ లొంగకుండా విద్యార్థులు మోడీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారని తెలిపారు.

విద్యార్థి ఉద్యమం ముందు ప్రభుత్వం తలవచిందన్నారు. సిజెపి, ఎస్‌ఎఫ్‌ఐతో పాటు వామపక్ష విద్యార్థి సంఘాలు జంతర్‌మంతర్ ఉద్యమానికి నాయకత్వం వహించాయని చెప్పారు. ఈ ఉద్యమానికి ప్రజల నుంచి పెద్దఎత్తున మద్దతు లభించింద న్నారు. బీహార్‌లోని బంకిపూర్ ఉప ఎన్నికలో బిజెపికి ఎదురైన ఓటమి కూడా జంతర్‌మంతర్ ఉద్యమ ప్రభావానికి నిదర్శనమని అన్నారు.

## త్వరలో హర్మూజ్‌లో 'ఎక్స్‌క్లూజన్ జోన్' ఏర్పాటు..



అమెరికాతో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో హర్మూజ్ జలసంధిపై ఇరాన్ సంచలన నిర్ణయం తీసుకుంది. ఈ జలసంధి సమీపంలో కొత్తగా ఓ 'ఎక్స్‌క్లూజన్ జోన్' (నిషేధిత ప్రాంతం) ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ ప్రాంతంలోకి ప్రవేశించే ఏ నౌకపైన అయినా కఠిన ఆంక్షలు విధిస్తామని స్పష్టం చేసింది.

ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి మొహ్సెన్ రెజాయీ ప్రభుత్వ టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వివరాలు వెల్లడించారు. రాబోయే కొద్ది రోజుల్లో లేదా వారాల్లో ఈ జోన్‌ను అధికారికంగా ప్రకటిస్తామని తెలిపారు. అమెరికా నేవీ ఏర్పాటు చేసిన బ్లాకేడ్ లైన్ నుంచి ప్రారంభమై, హర్మూజ్ జలసంధి మీదుగా పర్షియన్ గల్ఫ్‌లోకి ఈ జోన్ విస్తరించి ఉంటుందని వివరించారు.

ఈ ప్రాంతంలోకి వచ్చే నౌకలను ఇరాన్ ఆంక్షల జాబితాలో చేర్చుతామని, ఇది వాటి ఇన్సూరెన్స్, భవిష్యత్ ప్రయాణాలపై ప్రభావం చూపుతుందని ఆయన హెచ్చరించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ "హర్మూజ్ తెరిచే ఉంది" అని చెప్పడం ఓ "పెద్ద అబద్ధం" అని రెజాయీ కొట్టిపారేశారు. గతంలో రోజుకు 100కు పైగా నౌకలు ప్రయాణించే ఈ మార్గంలో, ఇప్పుడు కేవలం 7-8 నౌకలు మాత్రమే (అదీ ఇరాన్‌కు అవసరమైనవి) వెళ్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

## కలవరం గురిచేస్తోన్న ఆకునూరి నివేదిక..

ప్రతి ఊరికి ఒక గుడి ఉంటుందో లేదో కానీ బడి మాత్రం ఉంటుంది. బడి ప్రాధాన్యత అలాంటిది. ఒకవేళ ప్రభుత్వ పాఠశాల కానీ ప్రైవేటు పాఠశాల కానీ లేకపోయినా కనీసం ఆ ఊర్లో ఎవరో చదువుకున్న వ్యక్తి అయినా నలుగురిని కూర్చోబెట్టుకుని ఏదో నేర్పుతుంటాడు. చదువుకు అనాది నుండి అదే ప్రాముఖ్యత. ఎవరైనా తాము చదివిన బడిని, పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులను అంత తొందరగా మరువలేరు. బడి పట్ల అభిమానం, గురువుల పట్ల గౌరవం ఏనాడు తరగవు. బడితో ఉండే అనుబంధం చిరకాలం నిలుస్తుంది. చిన్ననాటి బడి గురువులు కనపడగానే సహజంగానే మనసు గతం లోతుల్లోకి వెళ్లిపోతుంది. మన తెలంగాణ విద్యా కమిషన్ ఊళ్ళలోని పాఠశాలలను విలీనం చేసి ప్రతి మండలంలో విద్యార్థుల సంఖ్యను బట్టి మూడు లేదా నాలుగు తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను ఏర్పాటు చేయమని సిఫార్సు చేయగా రాష్ట్ర ప్రభుత్వం అందుకు అంగీకరించి నిధులు కేటాయించి రంగంలోనికి దిగుతున్నది. మనం చిన్నతనంలో చదువుకున్న ప్రాథమిక, ప్రాథమిక ఉన్నత, సెకండరీ పాఠశాలలన్నీ కలిసిపోయి ఒకే పాఠశాలగా ఇంటర్మీడియట్‌వరకు నడుస్తాయట. వివిధ యాజమాన్యాలతో నేడు నడుస్తున్న 28 రకాల పాఠశాలలన్నీ మాయమై మూడు లేదా నాలుగు రకాలు మాత్రమే మనకు కనబడతాయి. అంతేకాదు ప్రభుత్వ ఉపాధ్యాయులు కూడా క్రమంగా తగ్గిపోయి కాలక్రమంలో కాంట్రాక్టు టీచర్లే ఈ పబ్లిక్ స్కూల్స్‌లో పాఠాలు చెప్తారు. జూనియర్ కళాశాలలు, ఇంటర్మీడియట్ బోర్డు కూడా రద్దు కాబోతున్నాయి. ఇంటర్ ప్రథమ సంవత్సరానికి వార్షిక పరీక్షలు కూడా ఉండవు. ఈ పెను మార్పులన్నీ విద్యా విధానాన్ని ఏం చేస్తాయో కానీ మొత్తం మీద ఒక గందరగోళ పరిస్థితి మాత్రం ప్రస్తుతం నెలకొని ఉంది. ఇంటర్మీడియట్ తర్వాత ఇంజినీరింగ్, అగ్రికల్చర్ బిఎస్‌సి, ఫార్మసీ లాంటి కోర్సులు చదవడానికి కూడా ప్రవేశ పరీక్షలు ఉండవు. కేవలం ఇంటర్‌లో మార్కుల ప్రాతిపదికన సీట్ల కేటాయింపు జరుగుతుంది. అవి అలాగే కొనసాగితే సంతోషించాల్సిన పరిస్థితి. తెలంగాణ విద్యా కమిషన్ ఆకునూరి మురళి అనే ఒక ఐఎఎస్ అధికారి నేతృత్వంలోని టీం రాష్ట్రంలోని 35 పాఠశాలలు తిరిగి తల్లిదండ్రులతో, విద్యార్థులతో సమావేశాలు జరిపి 54 సెమినార్లు నిర్వహించి ఐదు రాష్ట్రాలు, మూడు విదేశాలు పర్యటించి దాదాపు 18 నెలల కాలంలో ఇచ్చిన నివేదికలో 434 సిఫార్సులు చేసి విద్యావేత్తలను, ఉపాధ్యాయ సంఘాలను, ముఖ్యంగా విద్యాభిమానులను ఆశ్చర్యములోనేకాక ఆగ్రహానికి గురిచేసింది. ప్రభుత్వ విద్యను, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తామని, ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలకు మంగళం పాడుతామని ప్రభుత్వం పదేపదే చెప్పడమే కానీ గత రెండున్నర ఏళ్లలో అందుకు చేసిందేమీ లేదు.

## మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేస్తే చర్యలు



చెన్నై : మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేస్తే ఎంతటి వారిపైనైనా చట్టం ప్రకారం చర్యలు తప్పవని తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ స్పష్టం చేశారు. అసెంబ్లీలో ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. భావ ప్రకటనా స్వేచ్ఛను బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని విజయ్ సూచించారు. ప్రజలను,ముఖ్యంగా ... మహిళలను అవమానించే విధంగా మాట్లాడటం సరికాదన్నారు. రాజకీయ విమర్శలకు స్వేచ్ఛ ఉన్నప్పటికీ.. మహిళలను కించపరిచే వ్యాఖ్యలకు మాత్రం అడ్డుపెట్టుకోలేమని స్పష్టం చేశారు.గతంలో అసెంబ్లీలో మాజీ ముఖ్యమంత్రి జయలలిత ఎదుర్కొన్న అవమానాలను కూడా ఆయన ప్రస్తావించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు మరింత సమర్థంగా పనిచేయాలని విజయ్ అన్నారు. నేరాలు జరిగిన తర్వాత నిందితులను అరెస్టు చేయడం కంటే.. నేరాలు జరగకుండా ముందుగానే నిరోధించడమే పోలీసుల ప్రధాన బాధ్యత కావాలని పేర్కొన్నారు. చట్టాన్ని పాటించే ప్రజలకు పోలీసులు మిత్రులుగా, ఉల్లంఘించేవారికి కఠినంగా వ్యవహరించాలని సూచించారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల విషయంలో చర్యలు చేపట్టడంలో తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు.

## కేసీఆర్ భూముల వివాదం చంద్రబాబు జపం

హైదరాబాద్: రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా కేసీఆర్ భూములపై సమగ్ర విచారణ చేపడుతామని స్పష్టమైన ప్రకటన చేసిన తర్వాత, తెలంగాణ రాజకీయాల్లో సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ఈ భూముల వివాదంలో పూర్తిగా ఇరుక్కుపోయిన గులాబీ పార్టీ, ఆ ఉచ్చు నుంచి బయటపడేందుకు సరికొత్త సెంటిమెంట్ అస్త్రాన్ని ప్రయోగించాలని చూస్తున్నదన్న వాదన రాజకీయ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. ముఖ్యంగా కేసీఆర్, కేటీఆర్ ఫామ్ హౌజ్ భూములు, వాటి కేటాయింపులపై పెద్దఎత్తున చర్చ జరుగుతుండటంతో, ప్రజల దృష్టిని మళ్లించేందుకు బీఆర్ఎస్ నాయకులు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారన్న చర్చ జరుగుతోంది.అయితే, ప్రధానంగా కేసీఆర్ , కేటీఆర్ భూముల చుట్టూ వివాదం నడుస్తున్నప్పటికీ, బీఆర్ఎస్ మాత్రం పూర్తిగా చంద్రబాబు జపం వైపు మళ్లడం గమనార్హం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆంధ్రప్రదేశ్‌కు అక్రమంగా నీళ్లు వదిలేస్తున్నారని, గురుదక్షిణ కింద తెలంగాణ హక్కులను తాకట్టు పెడుతున్నారని కేటీఆర్, హరీష్ రావు, జగదీశ్వర్ రెడ్డి వంటి సీనియర్ నేతలందరూ ఒకే గళంతో తీవ్ర ఆరోపణలు గుప్పిస్తున్నారు. ఇటీవల భూముల అక్రమాలపై రేవంత్ రెడ్డి స్వయంగా ఈ ముగ్గురు నేతల పేర్లను ప్రస్తావిస్తూ తీవ్రమైన ఆరోపణలు చేసిన నేపథ్యంలోనే ఈ పరిణామం చోటుచేసుకుంది. రేవంత్ సంధించిన ప్రశ్నలకు నేరుగా, వాస్తవాలతో కూడిన సమాధానం చెప్పలేకనే బీఆర్ఎస్ నాయకులు ఉద్దేశపూర్వకంగానే ఏపీ అంశాన్ని



తెరపైకి తెచ్చి చంద్రబాబును టార్గెట్ చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.నిజానికి, గత కొంతకాలంగా బీఆర్ఎస్ అనుసరిస్తున్న రాజకీయ శైలి ఇదే రీతిలో సాగుతోంది.

తమపై అవినీతి లేదా భూ ఆక్రమణల ఆరోపణలు వచ్చిన ప్రతిసారీ, కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని బీఆర్ఎస్ ఎదురుదాడికి దిగుతోంది. కానీ తాజా పరిణామాలను పరిశీలిస్తే, రేవంత్ రెడ్డిపై డైవర్షన్ పాలిటిక్స్ అంటూ ఆరోపణలు చేస్తున్న గులాబీ పార్టీ నేతలే స్వయంగా ఆ వ్యూహాన్ని అమలు చేస్తున్నారనే అభిప్రాయం వ్యక్తంఅవుతోంది. పార్టీ అధినేత కుటుంబాన్ని, కీలక నేతలను చుట్టుముట్టిన భూముల వివాదాల నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికే ఈ సెంటిమెంట్ రాజకీయాలు తెరపైకి తెచ్చారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది.

# సైబర్ నేరాలపై జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి - జిల్లా ఎస్పీతుషార్ డూడి

చిత్తూరు : జిల్లా పరిధిలో సైబర్ నేరాల నియంత్రణ, ప్రజల్లో అవగాహన కల్పించడం, సైబర్ మోసాల బారిన పడిన బాధితులకు సకాలంలో సహాయం అందించేందుకు జిల్లా పోలీసు శాఖ నిరంతరం చర్యలు చేపడుతోందని జిల్లా ఎస్పీ తుషార్ డూడి, ఒక ప్రకటనలో తెలిపారు. 16-09-2025 నుండి 15-09-2026 వరకు చిత్తూరు జిల్లా పరిధిలోని నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఔఅఖీఖ) ద్వారా మొత్తం 1,608 ఫిర్యాదులు నమోదయ్యాయి. పోలీసుల తక్షణ చర్యల ఫలితంగా సైబర్ మోసాలకు సంబంధించిన రూ. 4,01,57,226/- నగదును హోల్డ్ చేయడం జరిగింది. అందులో ఇప్పటివరకు రూ. 2,15,60,922/- నగదును బాధితులకు రీఫండ్ చేయడం జరిగింది. ఈ సందర్భముగా జిల్లా ఎస్పీ శ్రీ తుషార్ డూడి, ఎఖూ గారుమాట్లాడుతూ... సైబర్ నేరగాళ్లు రోజురోజుకూ కొత్త కొత్త పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తున్నారు. అత్యాశ, భయం, అత్యవసర పరిస్థితి వంటి అంశాలను ఆసరాగా చేసుకుని బాధితుల నుంచి నగదు దోచుకుంటున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండటం ద్వారా ఇటువంటి మోసాలను చాలా వరకు నివారించవచ్చు."బ్యాంకు అధికారులు, పోలీసు అధికారులు, ప్రభుత్వ సంస్థల పేరుతో ఫోన్ చేసి ూఖ, ఖఎౖ, అఎ, ంఓ వివరాలు, బ్యాంక్ ఖాతా వివరాలు లేదా ఇతర వ్యక్తిగత సమాచారాన్ని ఎవరైనా అడిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వకూడదని జిల్లా ఎస్పీ గారు సూచించారు.

అలాగే, డిజిటల్ అరెస్ట్, ఐజఆ అప్‌డేట్, ఉద్యోగాలు, పెట్టుబడులు, రివార్డులు,లోన్‌లు, ట్రేడింగ్,ఆన్‌లైన్ గేమింగ్, ఫేక్ కస్టమర్ కేర్, సోషల్ మీడియా మోసాలు వంటి సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సైబర్ మోసం జరిగిన వెంటనే ఉనీశ్రీటవని ఊనీబీతీ అత్యంత కీలకం. మోసం జరిగిన తర్వాత తొలి గంటలోనే 1930కు సమాచారం అందించి, సంబంధిత బ్యాంకు లావాదేవీలను నిలిపివేయడానికి చర్యలు ప్రారంభించే అవకాశం ఉంటుంది. ప్రతి నిమిషం విలువైనదే కాబట్టి ఆలస్యం చేయకుండా వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని జిల్లా ఎస్పీ సూచించారు. అలాగే లిలిలి. ఇ.ఎవతీఇ.తీతిఎవ. ఐనీల. తిని (ఔజీబితినీనిజీశ్రీ అఎవతీ అతీతిఎవ ఖీవజూనీతీబితినిణ ఖనీతీబిజీశ్రీ) ద్వారా వెంటనే ఫిర్యాదు నమోదు చేయాలని తెలిపారు. మోసం జరిగిన తొలి గంటల్లోనే సమాచారం అందించడం ద్వారా మోసపోయిన నగదును నిలిపివేసే అవకాశం ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు.

# అడ్డగోలు విద్యా సంస్థలపై యాక్షన్ షురూ

గుంటూరు, : ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ అభ్యర్థులను పావులుగా వాడుకుంటూ ప్రభుత్వంపై బురదజల్లేందుకు యత్నిస్తున్న కొన్ని ప్రైవేటు కోచింగ్ కేంద్రాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాబుద్ధులు నేర్పి, పోటీ పరీక్షలకు సన్నద్ధం చేయాల్సిన సంస్థలు రాజకీయ ప్రయోజనాల కోసం విద్యార్థులను రోడ్లపైకి ఎక్కించి ఆందోళనలు, నిరసనలు చేయిస్తుండటంపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇలాంటి అవాంఛనీయ చర్యలకు పాల్పడుతున్న నిర్వాహకులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పోటీ పరీక్షల అభ్యర్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఇప్పటికే తెచ్చిన ఆంధ్రప్రదేశ్ కోచింగ్ సంస్థల నియంత్రణ నిబంధనలు 2026 , జీవో నెంబర్ 9 మార్గదర్శకాలకు అనుగుణంగానే ప్రతి ప్రైవేటు కోచింగ్ సెంటర్ నడుచుకోవాల్సి ఉంటుంది. అయితే, నిబంధనలను బేఖాతరు చేస్తూ కొన్ని సంస్థల యజమానులు తెరవెనుక రాజకీయ వ్యవహారాలు నడుపుతున్నట్లు నిఘా వర్గాల పరిశీలనలో తేలింది. సంస్థలలో చేరిన అభ్యర్థులపై మానసిక ఒత్తిడి తెచ్చి, వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ప్రభుత్వంపై దుష్ప్రచారం చేసేలా ప్రేరేపిస్తున్నారని సీఎం దృష్టికి వచ్చింది. కొన్ని కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం అభ్యర్థులను ఉద్దేశపూర్వకంగా ఆందోళనలకు పురిగొల్పుతున్నారని ప్రభుత్వం తేల్చింది. కెరీర్ నిర్మించుకోవాల్సిన అమూల్యమైన సమయంలో విద్యార్థులను రాజకీయ ప్రేరేపిత నిరసనల్లో భాగస్వాములను చేయడం తీవ్రమైన నేరమని ప్రభుత్వం హెచ్చరించింది. నిబంధనలను ఉల్లంఘించి విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడే సంస్థల గుర్తింపు రద్దు చేయడంతో పాటు, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. విద్యార్థులు, నిరుద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఎల్లవేళలా కట్టుబడి ఉందని, వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించేందుకు తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని ఈ సందర్భంగా ప్రభుత్వం పునరుద్ఘాటించింది. అయితే ప్రైవేటు కోచింగ్ సెంటర్ల ముసుగులో రాజకీయ కుట్రలు పన్నుతూ వ్యవస్థలను అస్థిరపరచాలని చూస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పింది. నిబంధనల పరిధిలోనే సంస్థలు కార్యకలాపాలు సాగించాలని, విద్యా వాతావరణాన్ని దెబ్బతీసే ప్రయత్నాలను ఉక్కుపాదంతో అణచివేస్తామని హెచ్చరించింది.

# మండుతున్న కూరగాయల ధరలు



విజయవాడ, : సామాన్యులపై నిత్యావసర సరుకుల భారం పడుతోంది. ఇప్పటికే షుగర్ ధరలు పెరగ్గా.. ఇప్పుడు కూరగాయల ధరలు కూడా పెరుగుతున్నాయి. గత కొద్ది రోజులుగా ఉల్లిపాయల ధరలు ఘాటెక్కిస్తున్నాయి. ధరలు ఒక్కసారిగా కొండెక్కాయి. కొద్ది రోజుల క్రితం కిలో ఉల్లి రూ. 20కే లభించగా.. ఇప్పుడు ఏకంగా రూ. 60కి చేరుకుంది. కొద్ది రోజుల వ్యవధిలోనే రూ. 40 పెరగడం సామాన్యులకు భారమనే చెప్పవచ్చు. ఎల్‌నీనో ప్రభావంతో పంట ఉత్పత్తి లేకపోవడం, తెగుళ్లు, ఇతర కారణాల వల్ల డిమాండ్‌కు తగ్గట్లు సరఫరా లేకపోవడంతో ధరలు పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. ధరలు ఇలాగే కొనసాగే అవకాశముందని, రానున్న రోజుల్లో పెరిగే అవకాశముందని అంచనాలు వేస్తున్నారు. కిలో ఉల్లి రూ. 100కి చేరుకున్నా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని చెబుతున్నారు. గతంలో పలుమార్లు ఉల్లి సెంచరీ కొట్టింది. ఇప్పుడు కూడా అదే తరహాలో పరిస్థితులు రానున్నాయని అంటున్నారు. దీంతో సామాన్యులు ఉల్లిని చూస్తే బెంబేలెత్తిపోతున్నారు. హైదరాబాద్‌లోని రైతు బజార్లలో ఉల్లిపాయల ధరలు పెరిగాయి. నగరంలోని రైతు బజార్లలో కిలో ఉల్లి రూ. 54 పలుకుతోంది. ఇక కిలో టమాట రూ. 17. వంగ రూ. 28, బెండకాయ రూ. 35, పచ్చిమిర్చి రూ. 40, క్యాలీఫ్లవర్ రూ. 21, క్యాబేజీ రూ. 15, క్యారెట్ రూ. 50, దొండకాయ రూ. 35, ఆలు రూ. 17, సొరకాయ రూ. 9, పొట్లకాయ రూ. 15, బీన్స్ రూ. 60, గోరుచిక్కుడు రూ. 28, చిక్కుడుకాయ రూ. 40, దోసకాయ రూ. 28, బీరకాయ రూ. 32, కాకరకాయ రూ. 32, చామగడ్డ రూ. 28, కీరదోస రూ. 40, క్యాప్సికం రూ. 41, బీట్ రూట్ రూ. 35, కందగడ్డ రూ. 35, చిలగడదుంప రూ. 35, మామిడి రూ. 45, మునగ రూ. 45 పలుకుతోంది. విజయవాడలో కిలో ఉల్లి రూ. 55కు లభిస్తున్నాయి. ఇక వంకాయలు రూ. 22, టమాటా రూ. 26, బెండకాయ రూ. 18, పచ్చిమిర్చి రూ. 30, కాకర రూ. 32, బీర రూ. 30, క్యాలీఫ్లవర్ రూ. 35, క్యాబేజీ రూ. 24, క్యారెట్ రూ. 48, దొండకాయ రూ. 24, బంగాళదుంప రూ. 24, గోరుచిక్కుళ్లు రూ. 28, దోస రూ. 22, పొట్లకాయ రూ. 13, చామదుంప రూ. 34 పలుకుతున్నాయి. అయితే రైతు బజార్లలో ధరలు ఇలా ఉండగా.. రిటైల్ మార్కె?ట్లలో కిలో ఉల్లి రూ. 70కి విక్రయిస్తున్నారు. పంట దిగుబడి తగ్గడం, మార్కెట్లో సరఫరా లేకపోవడంతో ఉల్లి ధరలు పెరుగుతున్నట్లు చెబుతున్నారు. జులైలో రోడ్ల పక్కన ట్రాలీ ఆటోల్లో రూ. 100కు 4 కిలోల ఉల్లి ఇవ్వగా.. ఇప్పుడు ట్రాలీ వాహనాల్లో కూడా రూ. 200కి 3 కిలోల చొప్పున అందిస్తున్నారు. అయితే ఏపీ ప్రభుత్వం సామాన్యులకు ఉల్లి ధరల నుంచి ఉపశమనం కలిగించే ప్రయత్నం చేస్తోంది. అందులో భాగంగా రైతు బజార్లలో రూ. 35కే కిలో చొప్పును అందిస్తోంది. అటు కేంద్రం కూడా రంగంలోకి దిగింది. ధరల స్థిరీకరణ నిధి ద్వారా 1 లక్షా 21 వేల టన్నుల బఫర్ స్టాక్ అందుబాటులోకి తెచ్చింది. మరోవైపు వ్యాపారులు కృత్రిమ కొరతను సృష్టించి డబ్బులు సొమ్ము చేసుకుంటున్నారు. హైదరాబాద్‌లోని మలక్ పేట్ మార్కెట్లో క్వింటా ఉల్లి రూ. 5500 పలుకుతోంది. అటు దేశవ్యాప్తంగా కూడా ధరలు పెరిగాయి

# ఆర్థిక రాజధానిగా విశాఖ

విశాఖపట్టణం, : విశాఖపట్నం భవిష్యత్‌లో మరింత వేగంగా విస్తరించే అవకాశాలున్న నగరంగా మారుతోంది. ఐటీ రంగం, డేటా సెంటర్లు (, పరిశ్రమలు, పర్యాటకం, వాణిజ్య కార్యకలాపాలు పెరుగుతున్న కొద్దీ నగరానికి వచ్చే ప్రజల సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉంది. మిట్టల్ స్టీల్ ప్లాంట్ వంటి భారీ పారిశ్రామిక ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తే ఉపాధి అవకాశాలు పెరిగి ఇతర ప్రాంతాల నుంచి కూడా ప్రజలు నగరానికి వచ్చే పరిస్థితి ఏర్పడవచ్చు. దీంతో రాబోయే సంవత్సరాల్లో విశాఖ జనాభా గణనీయంగా పెరిగే అవకాశం ఉందనే అంచనాలు వినిపిస్తున్నాయి. జనాభా పెరుగుదలతో పాటు నగర మౌలిక సదుపాయాలను కూడా అదే స్థాయిలో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంటుంది. ముఖ్యంగా రవాణా, విద్యుత్, తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు సరిపడా నీటి లభ్యత వంటి అంశాలు కీలకంగా మారనున్నాయి. ప్రస్తుతం ఉన్న నీటి వనరులతో భవిష్యత్ అవసరాలను తీర్చడం కష్టమయ్యే అవకాశం ఉన్నందున ముందుగానే దీర్ఘకాలిక ప్రణాళిక రూపొందించాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. ఈ విషయంలో సింగపూర్ ) అనుసరిస్తున్న నీటి నిర్వహణ విధానాలను ఉదాహరణగా తీసుకోవచ్చనే అభిప్రాయం ఉంది. సహజ నీటి వనరులు పరిమితంగా ఉన్న సింగపూర్.. వర్షపు నీటిని సేకరించడం, ఉపయోగించిన నీటిని శుద్ధి చేసి మళ్లీ వినియోగించడం, సముద్రపు నీటిని డీశాలినేషన్ చేయడం వంటి పద్ధతులను విస్తృతంగా ఉపయోగిస్తోంది. ముఖ్యంగా నీటి పునర్వినియోగం సముద్రపు నీటిని తాగునీటిగా మార్చే సాంకేతికత ద్వారా అక్కడ నీటి అవసరాల్లో గణనీయమైన భాగాన్ని సమకూర్చుకుంటున్నారు. ఈ విధానం విశాఖకు కూడా ఉపయోగపడే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. విశాఖ చుట్టుపక్కల ఉన్న రిజర్వాయర్లు కూడా నగర నీటి అవసరాలకు ముఖ్యమైన వనరులే. వాటిలో పూడిక తొలగించడం, సామర్థ్యాన్ని పెంచడం, ఆధునిక నిర్వహణ పద్ధతులు అమలు చేయడం ద్వారా నిల్వ సామర్థ్యాన్ని మెరుగుపరచవచ్చని సూచిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న వనరులను సమర్థంగా ఉపయోగించుకోవడంతో పాటు కొత్త నీటి వనరులపై కూడా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందిపోలవరం ప్రాజెక్టు ద్వారా గోదావరిజలాలను విశాఖకు తీసుకురావడం కూడా భవిష్యత్ నీటి అవసరాలకు ఉపయోగపడే అంశంగా భావిస్తున్నారు. ఈ నీటిని నిల్వ చేసేందుకు నగరం చుట్టూ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. అదే సమయంలో సముద్రం అందుబాటులో ఉన్నందున పెద్ద స్థాయిలో డీశాలినేషన్ ప్లాంట్లు ఏర్పాటు చేసే అవకాశాన్ని కూడా పరిశీలించవచ్చు. తాగునీరు, పరిశ్రమలు, భవిష్యత్ జనాభా అవసరాలను ఒకే ప్రణాళికలోకి తీసుకువచ్చి సమగ్ర వాటర్ గ్రిడ్ ఏర్పాటు చేస్తే నీటి సరఫరాను మరింత సమర్థంగా నిర్వహించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. వర్షపు నీటి సంరక్షణ, రీసైక్లింగ్, రిజర్వాయర్ల ఆధునీకరణ, గోదావరి జలాల వినియోగం, డీశాలినేషన్ వంటి మార్గాలను కలిపి ముందుకు తీసుకెళ్లగలిగితే విశాఖ భవిష్యత్ నీటి అవసరాలకు ముందుగానే సిద్ధమయ్యే అవకాశం ఉంటుంది.

# ఆరోపణలు... ప్రత్యారోపణలు డీఎస్సీకి కథ ముగింపు ఎప్పుడు



విజయవాడ : ఏపీ ప్రభుత్వం ఎంత ఓపికగా, పారదర్శకంగా వివరణలిస్తున్న కొద్దీ.. వైసీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి వర్గం ఉద్దేశపూర్వకంగానే నిరాధార ఆరోపణల రాళ్లు విసురుతోంది. ప్రభుత్వం ఇస్తున్న ప్రతి సమాచారానికి వాస్తవాలతో కూడిన రివర్స్ కౌంటర్లు వస్తున్నాయని, తాము లేవనెత్తుతున్న అంశాలన్నీ గాల్లో దీపాలేనని ఆ పార్టీ నాయకులకు కూడా బాగా తెలుసు. అయినప్పటికీ ప్రజల్లో ఏదో ఒక అభూతకల్పనను నిరంతరం సజీవంగా ఉంచాలనే దుర్బుద్ధితో జగన్ రెడ్డి అండ్ కో ఈ తప్పుడు ప్రచారాలను నిరంతరం కొనసాగిస్తూనే ఉంది. కేవలం తమ అబద్ధాలను పదే పదే ప్రచారం చేసుకుంటూ కాలం వెళ్లదీయడమే లక్ష్యం. ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోతే తాము ఆడే డ్రామాలే నిజమని జనం నమ్ముతారనే భయంతో, ప్రభుత్వం ప్రతి చిన్న అంశానికీ ఆధారాలతో సహా వివరంగా సమాధానమిస్తోంది. అయితే దీన్ని తమకు అనుకూలంగా మలుచుకుంటున్న వైసీపీ, అదే అలుసుగా తీసుకుని ప్రతి దానిని డీఎస్సీ స్కాం అంటూ ప్రజల మైండ్‌లో రుద్దడానికి సర్వశక్తులూ ఒడ్డుతోంది. ప్రజా సమస్యలపై సద్విమర్శలు చేయడం మానేసి, కేవలం నిరుద్యోగుల ఆశలతో ఆడుకునేలా నిత్యం ఏదో ఒక వివాదాన్ని రగిలించడమే ఏకైక అజెండాగా మార్చుకుంది. ఈ కుట్రపూరిత ప్రచారంలో భాగంగా మొదట పేపర్ లీక్ అంటూ నానా హంగామా సృష్టించారు; కానీ అది ఎక్కడా నిలవకపోవడంతో వెంటనే యూటర్న్ తీసుకుని ఒకే కులానికి చెందినవారికి ఉద్యోగాలొచ్చాయంటూ' విషం చిమ్మారు. ఆ విమర్శ కూడా పటాపంచలు కావడంతో, ఇప్పుడు ఏకంగా స్పోర్ట్స్ కోటా అంశాన్ని పట్టుకుని వేలాడుతున్నారు. అసలు ఖోఖో కూడా ఒక ఆట కింద లెక్కేనా అంటూ జగన్ రెడ్డి స్వయంగా ఎద్దేవా చేయడం, క్రీడాకారుల ప్రతిభను కించపరిచేలా మాట్లాడటం చూస్తుంటే.. వినేవాళ్లు నవాబుల కాలం నాటి ఈ జోకులను ఎందుకు సీరియస్‌గా తీసుకోవాలో అర్థం కాని దుస్థితి ఏర్పడింది. కేవలం తమ రాజకీయ మనుగడ కోసం రాష్ట్రంలోని క్రీడాకారుల భవిష్యత్తును, పారదర్శకంగా భర్తీయవుతున్న ఉపాధ్యాయ నియామకాలను బలిపెట్టడానికి కూడాఆ పార్టీ వెనుకాడటం లేదు. వైసీపీ ఆడుతున్న ఈ విషపూరిత డ్రామాలు, పన్నే ప్లాన్లకు ప్రభుత్వం ఇకనైనా పూర్తిస్థాయిలోచెక్ పెట్టాల్సిన సమయం ఆసన్నమైంది. రోజువారీ రాజకీయ మైలేజ్ కోసం చేస్తున్న ఈ ఆరోపణలను ఎక్కడికక్కడ చట్టపరంగా, కఠినంగా నిలువరించాల్సిన అవసరం ఉంది. కేవలం మీడియా చర్చలకు వదిలేయకుండా, కోర్టుల్లో ఏమాత్రం నిలవని, కేవలం బురద జల్లే ఈ నకిలీ డిబేట్లను తక్షణం న్యాయపరమైన చర్యలతో అడ్డుకోవాలి. లేదంటే ఈ అబద్ధాల ప్రచారమే నిజమనే భ్రమను కల్పించడంలో వారు సఫలమయ్యే ప్రమాదం ఉంది. ప్రభుత్వం తన పాలనా దక్షతను, పారదర్శకతను చాటుకుంటూనే.. వ్యవస్థలను అప్రతిష్టపాలు చేయాలని చూస్తున్న ఈ పాత రాజకీయ శైలిని ఉక్కుపాదంతో అణచివేయాలి. నిరుద్యోగుల ఉసురుపోసుకునేలా రోజుకో డ్రామా ఆడుతున్న వైసీపీకి ప్రజాక్షేత్రంలోనూ, చట్టం ముందూ తగిన బుద్ధి చెప్పినప్పుడే ఇలాంటి నిరాధార రాళ్ల క్రీడలకు శాశ్వత బ్రేక్ పడుతుంది.

# వారసుల కోసమే సీనియర్ల ప్రయత్నాలు



**శ్రీకాకుళం:** ఉత్తరాంధ్ర రాజకీయాల్లో వైఎస్‌ఆర్‌సీపీ ఖాళీ అవుతోందన్న సంకేతాలు రోజురోజుకూ మరింత బలపడుతున్నాయి. గత సార్వత్రిక ఎన్నికల ఘోర పరాభవం తర్వాత ఉనికి కోల్పోతున్న వైఎస్‌ఆర్‌సీపీలో కొనసాగడం తమ రాజకీయ భవిష్యత్తుకే కాకుండా, తమ వారసుల అరంగేట్రానికి కూడా ముప్పు అని సీనియర్ నేతలు గ్రహించినట్లుగా ప్రచారం జరుగుతోంది. ఇందులో భాగంగానే విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్‌ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు తన కుమార్తె సిరి సహస్రతో సహా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరిపోయారు. ఈ ఒక్క ఘటన ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని వైఎస్‌ఆర్‌సీపీ అగ్రనేతలకు ఒక స్పష్టమైన దిశానిర్దేశం చేసినట్లయింది. ప్రస్తుతం ఉత్తరాంధ్రకు చెందిన పలువురు మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ద్వితీయ శ్రేణి కీలక నేతలు టీడీపీ, జనసేన అధిష్టానాలతో తీవ్రంగా చర్చలు జరుపుతున్నారు. ఈ వలసల వెనుక ఉన్న ప్రధాన రాజకీయ కారణం రాబోయే మహిళా రిజర్వేషన్లు, వారసత్వ రాజకీయం . 2029 నాటికి చట్టసభల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్లు అమలుకావడం ఖాయమని తేలడంతో పాటు, ఇటీవల టీడీపీ మహానాడులో మంత్రి నారా లోకేష్ బిల్లు పాస్ కాకపోయినా పార్టీ తరఫున మహిళలకు 33% టికెట్లు కేటాయిస్తామని సంచలన ప్రకటన చేశారు. దీంతో తమ కుమార్తెలను లేదా కోడళ్లను రాజకీయ బరిలోకి దించాలనుకుంటున్న సీనియర్ నాయకులకు కూటమి పార్టీలే సురక్షితమైన, ఆశాజనకమైన వేదికలుగా కనిపిస్తున్నాయి. వైఎస్ఆ ర్‌సీపీ జెండాపై పోటీ చేస్తే భవిష్యత్తులో గెలిచే అవకాశాలు శూన్యమని, తమ వారసుల రాజకీయ జీవితాలు ప్రారంభంలోనే దెబ్బతింటాయని ఈ సీనియర్లు భావిస్తున్నారు. అందుకే, చిన్న శ్రీను తన కుమార్తెను జెడ్పీ చైర్‌పర్సన్‌గా నిలబెట్టే ముందస్తు వ్యూహంతో టీడీపీ పసుపు కండువా కప్పుకున్నట్లే.. మిగిలిన ముగ్గురు ఉమ్మడి జిల్లాల నేతలు కూడా తమ మహిళా వారసులను స్థానిక సంస్థలు, రాబోయే అసెంబ్లీ స్థానాలకు స్థిరపరచేందుకు కూటమి నేతలతో రాయబారాలు నెరుపుతున్నారు. మరోవైపు కూటమి ప్రభుత్వం వైపు నుంచి కూడా ఈ వలసలకు గ్రీన్ సిగ్నల్ లభిస్తోంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో ఉత్తరాంధ్ర వ్యాప్తంగా ఏకపక్ష విజయాలు సాధించి, ప్రతిపక్షాన్ని క్షేత్రస్థాయి నుంచి పూర్తిగా తుడిచిపెట్టాలనేది కూటమి వ్యూహం.

బలమైన ఓటు బ్యాంక్, సామాజిక వర్గ సమీకరణాలు ఉన్న వైఎస్‌ఆర్‌సీపీ సీనియర్ల వారసులను చేర్చుకోవడం ద్వారా తమ గెలుపు అవకాశాలను మరింత సుగమం చేసుకోవచ్చని టీడీపీ-జనసేన వర్గాలు లెక్కిస్తున్నాయి. ఉత్తరాంధ్రలో వైఎస్‌ఆర్‌సీపీ ఒక రకమైన శూన్యతలోకి జారుకుంటోందనడంలో ఎలాంటి సందేహం లేదు. అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వైఖరి, పార్టీ పునర్నిర్మాణంలో కొరవడిన దిశానిర్దేశం వల్ల విసిగిపోయిన నేతలు.. తమ వారసుల భవిష్యత్తును కాపాడుకునేందుకు పవర్ అండ్ ఫ్యూచర్ ఉన్న కూటమి వైపే మొగ్గు చూపుతున్నారు. రాబోయే స్థానిక పోరు నాటికి ఉత్తరాంధ్ర వైఎస్‌ఆర్‌సీపీ నుంచి మరిన్ని వికెట్లు పడటం, వారసుల రాజకీయ రంగానికి కూటమి వేదికగా మారడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది.

# మళ్లీ గుడ్ మార్నింగ్ అంటున్న కేతిరెడ్డి



అనంతపురం, : ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి.. గుడ్ మార్నింగ్ ధర్మవరం కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించారు. ఎన్నికల్లో ఓటమి అనంతరం ఈ కార్యక్రమానికి కేతిరెడ్డి దూరంగా ఉన్నారు. అయితే సోమవారం ఉదయం.. పట్టణంలోని చేనేత ఇళ్ల వద్దకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాల లబ్ధి అందుతోందా లేదా అనేది వాకబు చేశారు. త్వరలోనే మున్సిపల్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో.. ప్రజల్లోకి వెళ్లేందుకు ఈ కార్యక్రమాన్ని మళ్లీ ప్రారంభించారనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. వైసీపీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి .. తెలుగు రాజకీయాలపై అవగాహన ఉన్నవారికి పరిచయం అక్కర్లేని పేరు. గుడ్ మార్నింగ్ ధర్మవరం అంటే సోషల్ మీడియా యూజర్లకు కూడా చిరపరిచితమే. ఉదయాన్నే ప్రతి ఇంటి గడపనూ పలకరిస్తూ.. వారి సమస్యలను తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరించేందుకు కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి గతంలో గుడ్ మార్నింగ్ ధర్మవరం పేరుతో కార్యక్రమం చేపట్టారు. ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కేతిరెడ్డి చేపట్టిన ఈ కార్యక్రమం.. సోషల్ మీడియాలో సూపర్ హిట్ అయ్యింది. పొరుగు రాష్ట్రాల లోనూ.. ఆయన ఫాలోయింగ్ పెరిగింది. అయితే 2024 ఎన్నికల్లో ఊహించని రీతిలో ఓటమి పాలయ్యారు కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి. ఆ తర్వాత గుడ్ మార్నింగ్ కార్యక్రమాన్ని నిర్వహించలేదు. అయితే ఇన్ని రోజుల తర్వాత ఇప్పుడు మళ్లీ గుడ్ మార్నింగ్ ధర్మవరం కార్యక్రమాన్ని కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి తిరిగి ప్రారంభించారు. సోమవారం ఉదయం గుడ్ మార్నింగ్ ధర్మవరం కార్యక్రమం చేపట్టిన కేతిరెడ్డి.. చేనేత కార్మికుల ఇళ్ల వద్దకు వెళ్లి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఇటీవల అమలు చేసిన నేతన్న సేవలో పథకం కింద రూ. 25000 ఆర్థిక సహాయం అందిందా లేదా అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. నేతన్న సేవలో డబ్బులు చేనేతల హక్కు అని.. రాకుంటే ప్రభుత్వాన్ని నిలదీయాలని సూచించారు. మున్సిపల్ ఎన్నికలు వస్తున్నాయనే కారణంతోనే ప్రభుత్వం పింఛన్లు, నేతన్న సేవలో పథకం అంటూ హడావిడి చేస్తోందని కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి విమర్శించారు. అయితే ఎన్నికల్లో ఓటమి తర్వాత గుడ్ మార్నింగ్ ధర్మవరం కార్యక్రమానికి కేతిరెడ్డి దూరమయ్యారు. ఆ తర్వాత వైసీపీ తరుఫున ప్రభుత్వ తీరును ఎండగడుతూ అనేక నిరసన కార్యక్రమాలు కూడా చేపట్టారు. అయితే ఇప్పుడు మళ్లీ గుడ్ మార్నింగ్ ధర్మవరం కార్యక్రమం ప్రారంభించడానికి.. స్థానిక సంస్థల ఎన్నికలు కారణం కావొచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. స్థానిక ఎన్నికల్లో ఏకగ్రీవాలు జరగకూడదని.. అలాంటివి జరిగితే ఇంఛార్జిలకు సీట్లు ఇవ్వమంటూ వైసీపీ అధినేత వైఎస్ జగన్ కీలక ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. ఈ ప్రకటన ద్వారా స్థానిక సంస్థల ఎన్నికలను తానెంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది శ్రేణులకు జగన్ స్పష్టంచేశారు. ఈ క్రమంలోనే కేతిరెడ్డి మళ్లీ గుడ్ మార్నింగ్ ధర్మవరం బాట పట్టినట్లు భావిస్తున్నారు. అయితే ఈ కార్యక్రమం రోజూ కొనసాగుతుందా.. వారంలో ఒకరోజా అనే విషయాలపై క్లారిటీ రావాల్సి ఉంది.

# కవిత సమరశంఖం..



హైదరాబాద్, : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్ లో కవిత సమర శంఖం పూరించారు. ఆదివారం కొడంగల్ వేదికగా జరిగిన పాంచ జన్య సంకల్ప సభలో కవిత ఓపెన్ గా మాట్లాడారు. ఎటువంటి ఫిల్టర్లు లేకుండా తన అభిప్రాయాన్ని.. మొహమాటం లేకుండా చెప్పేశారు.నేను వాళ్ళు వదిలిన బాణం.. వీళ్ళు వదిన బాణం కాదు. అలాంటి తలకాయ లేని మాటలు మాట్లాడను. అలాంటి వారి కోసం నేను కొడంగల్ గడ్డమీద నుంచి చెబుతున్న. ఇప్పటికీ అధికారానికి.. విద్యకు దూరంగా ఉన్న మా బహుజనుల బాణాన్ని నేను. యువకుల యుద్ధ నినాదాన్ని నేను. వారికోసం మోడీతో కొట్లాడుతా. రేవంత్ రెడ్డితో కొట్లాడుతా. చివరికి కేసీఆర్ తో నైనా కొట్లాడుతా. తద్వారా తన మీద వస్తున్న విమర్శలకు ఈ స్థాయిలో కవిత సమాధానం చెప్పారు. అంతేకాదు తనమీద అవాకులు చవాకులు పేరుతున్న గులాబీ పార్టీ సోషల్ మీడియా.. ఆ పార్టీ అనుబంధ సోషల్ మీడియా గ్రూపులకు కవిత గట్టిగానే కౌంటర్ ఇచ్చారు.వాస్తవానికి కవిత పాంచ జన్య సభలో గట్టిగా మాట్లాడారు. ఒక రకంగా దీనిని ఎన్నికల సభ లాగా ఆమె చాలెంజ్ గా తీసుకొని ప్రసంగించారు.. ప్రారంభం నుంచి చివరి దాకా బహుజనుల విషయాలను ప్రస్తావించారు. తన తండ్రి పరిపాలన కాలంలో తెలంగాణ రాష్ట్రంలో ఆశించిన స్థాయిలో మార్పు రాలేదని. ముఖ్యంగా విద్య.. వైద్యం.. ఇతర వాటిల్లో వృద్ధి కనిపించలేదని కవిత క్లారిటీ ఇచ్చారు. విద్య.. వైద్యం వంటివి తమ ప్రథమ ప్రాధాన్యాలు అని కవిత క్లారిటీ ఇచ్చారు. అక్కడితోనే ఆగిపోలేదు.. ఇంకా చాలా విషయాలను కవిత ఈ సభలో చెప్పారు. తన తండ్రి పరిపాలన కాలంలో జరిగిన అవినీతిని.. అక్రమాలను.. తనను బయటికి పంపించిన విధానాన్ని ఆమె వివరించారు.ఇటీవల తన అత్తగారిల్లు అయిన నిజామాబాదులో పాంచ జన్య సభను నిర్వహించిన కవిత.. అక్కడ కన్నీళ్లు పెట్టుకున్నారు. సభలో మాట్లాడుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. కొడంగల్ లో మాత్రం ధైర్యంగా మాట్లాడారు. ప్రభుత్వం మీద ఆరోపణలు చేసిన ఆమె.. చివరికి తన తండ్రిని కూడా వదిలిపెట్టలేదు. అన్నిటికంటే ముఖ్యంగా గులాబీ పార్టీ సోషల్ మీడియాకు దిమ్మతిరిగిపోయేలాగా కవిత రిప్లై ఇచ్చింది. ఒక రకంగా దానిని స్లిప్పర్ షాట్ అని చెప్పవచ్చు. కొద్దిరోజులుగా గులాబీ పార్టీ సోషల్ మీడియా కవిత మీద వ్యక్తిగతంగా దాడి చేసే స్థాయిలో విమర్శలు చేస్తోంది. ఆ విమర్శలకు కవిత ఏర్పాటుచేసిన సోషల్ మీడియా గ్రూపులలో కౌంటర్ ఇస్తున్నప్పటికీ.. గులాబీ పార్టీ సోషల్ మీడియా ఆగడం లేదు. అందువల్లే కొడంగల్ సభ నుంచి కవిత గట్టిగా రిప్లై ఇచ్చారు. మరి దీనికి గులాబీ పార్టీ సోషల్ మీడియా ఎలాంటి కౌంటర్ ఇస్తుందో చూడాలి.

# గ్రాడ్యుయేట్ ఎన్నికల కోసం కసరత్తు షురూ

హైదరాబాద్, : తెలంగాణ రాష్ట్రంలో మరో ఆసక్తికరమైన రాజకీయ పోరుకు రణభేరి మోగింది. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ మరియు వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల పదవీకాలం మార్చి 2027తో ముగియనుండటంతో, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అధికారికంగా కొత్త ఓటర్ల జాబితా షెడ్యూల్‌ను విడుదల చేశారు. ప్రస్తుత సభ్యులైన సురభి వాణిదేవి , తీన్మార్ మల్లన్న ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ రెండు స్థానాల్లో ఎన్నికల కసరత్తు షురూ కావడంతో అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్, సీనియర్ పట్టభద్రుల పట్టున్న బీజేపీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా వ్యూహాలకు పదును పెడుతున్నారు.ఈ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమైన మైలురాయి.. సెప్టెంబర్ 28న విడుదల కానున్న పబ్లిక్ నోటీస్, ఫారం-18 ద్వారా ఓటర్ల నమోదు ప్రారంభం కావడం. గతంలో ఎంతమంది ఓటర్లు నమోదై ఉన్నప్పటికీ, గ్రాడ్యుయేట్ స్థానాల నిబంధనల ప్రకారం పాత ఓటర్ల జాబితా రద్దవుతుంది. ప్రతిసారి కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సిందే. నవంబర్ 6 వరకు ఫారం-18 స్వీకరించి, డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు. అంటే, దాదాపు 7 లక్షల మందికి పైగా ఉండే అవకాశం ఉన్న పట్టభద్రుల ఓట్లలో.. ఎవరు ఎక్కువ మంది నిజమైన మద్దతుదారులను ఫారం-18 నింపి ఓటర్లుగా నమోదు చేయించగలుగుతారో, వారికే పోలింగ్ రోజు సగం విజయం ఖాయమవుతుంది.ఈసారి పట్టభద్రుల సమరం చతుర్ముఖ పోటీని తలపిస్తోంది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేపట్టిన ఉద్యోగ నియామకాలు, జాబ్ క్యాలెండర్, డిఏ, పెన్షన్ అంశాలను ప్రధాన ప్రచారాస్త్రాలుగా మార్చుకుని నిరుద్యోగులు, ఉద్యోగుల ఓట్లను ఆకర్షించేందుకు ప్లాన్ చేస్తోంది. తమ బలాన్ని నిరూపించుకోవడానికి కాంగ్రెస్ యంత్రాంగం క్షేత్రస్థాయి వరకు ఫారం-18 దరఖాస్తులను చేరవేసి రికార్డు స్థాయిలో ఓటర్లను నమోదు చేయించే పనిలో పడింది. అటు ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ పార్టీకి ఇది అతిపెద్ద అగ్నిపరీక్ష. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల తర్వాత గ్రాడ్యుయేట్ వర్గాల్లో ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తిని, నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్



అమలులో జాప్యం వంటి అంశాలను లేవనెత్తి విద్యావంతులను తమ వైపు తిప్పుకోవాలని చూస్తోంది. గతంలో గెలిచిన మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ సీటును నిలబెట్టుకోవడంతో పాటు నల్గొండ-వరంగల్-ఖమ్మంలోనూ బలమైన పోటీ ఇచ్చేందుకు కేటీఆర్, హరీష్ రావులు ప్రత్యేకంగా టీమ్‌లను ఏర్పాటు చేసి ఓటర్ల నమోదు బాధ్యతలను స్థానిక నేతలకు అప్పగిస్తున్నారు.మరోవైపు హైదరాబాద్, రంగారెడ్డి మరియు నల్గొండ పట్టభద్రుల స్థానాల్లో బీజేపీకి సంప్రదాయంగా బలమైన ఓటు బ్యాంకు ఉంది.

విద్యావంతులు, ఐటీ నిపుణులు, ఆర్ఎస్ఎస్ అనుబంధ వర్గాల్లో ఆ పార్టీకి మంచి పట్టు ఉంది. కేంద్రంలో అధికారంలో ఉన్న మైలేజ్‌తో పాటు రాష్ట్ర సర్కార్ వైఫల్యాలను ఎండగడుతూ అర్బన్ ప్రాంతాల్లో అత్యధికంగా ఆన్‌లైన్ ద్వారా ఓట్లను నమోదు చేయించే వ్యూహంతో బీజేపీ సమాయత్తమవుతోంది. దీనికి తోడు తీన్మార్ మల్లన్న, ఇతర స్వతంత్ర, యువజన సంఘాల నాయకులు కూడా బరిలోకి దిగుతుండటంతో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు

అత్యంత ఉత్కంఠభరితంగా మారనుంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయానికి 'అభ్యర్థి ఇమేజ్' ఎంత ముఖ్యమో.. 'ఓటర్ల నమోదు డిజైన్' అంతకంటే వెయ్యింతలు ముఖ్యం. డిగ్రీ సర్టిఫికేట్లు సేకరించి, గెజిటెడ్ అటెస్టేషన్ చేయించి, గడువులోగా ఫారం-18 అధికారులకు చేరేలా ఏ పార్టీ యంత్రాంగం నెట్‌వర్క్‌ను పక్కాగా నడుపుతుందో.. ఆ పార్టీయే మార్చి 2027 పట్టభద్రుల పోరులో విజేతగా నిలుస్తుంది.

# థియేటర్ల బిజినెస్ లోకి మెగా ఫ్యామిలీ!

హైదరాబాద్, : టాలీవుడ్ టాప్ హీరోలలో కొంత మంది థియేటర్ బిజినెస్‌లో అడుగు పెట్టారు. తమ పేరుతో మల్టీప్లెక్స్‌లు కట్టారు. సూపర్ స్టార్ మహేష్ బాబుకు 'ఏఎంబీ', ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఏమో 'ఏఏఏ', మాస్ మహారాజా రవితేజ 'ఏఆర్‌టీ' అంటూ ప్రేక్షకులకు మంచి థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వడానికి మల్టీప్లెక్స్ లు కట్టారు. అల్లు ఫ్యామిలీ కోకాపేట్‌లో 'అల్లు సినిమాస్' నిర్మించి ంది. ఇప్పుడు ఈ లిస్టులో మెగాస్టార్ చిరంజీవి అడుగు పెడుతున్నారు. గ్రాండ్ ఎంట్రీ ఇవ్వడానికి రెడీ అయ్యారు.హీరోలు అందరితో మల్టీప్లెక్స్ వ్యాపారంలో భాగస్వామిగా ఉన్న ఏసియన్ సినిమాస్ సంస్థతోచిరంజీవి కూడా థియేటర్ వ్యాపారంలో అడుగు పెట్టేందుకు రెడీ అయ్యారు. ప్రపంచంలోనే అత్యంత భారీ సినిమా స్క్రీన్‌ను హైదరాబాద్ సిటీలో ఏర్పాటు చేయడానికి రెడీ అవుతున్నారు. అమెరికాలోని జార్జియా రాష్ట్రంలోని పూలర్ ప్రాంతంలో ఉన్న 'రాయల్ సినిమాస్ 14 ఐమాక్స్ డ్యూయల్ లేజర్' స్క్రీన్ ప్రస్తుతానికి ప్రపంచంలోనే అతి పెద్ద స్క్రీన్. ఆ రికార్డు దాని పేరిట ఉంది. ఆ స్క్రీన్ 101 అడుగుల వెడల్పు, 76.2 అడుగుల ఎత్తుతో ఉంటుంది. ఆ థియేటర్ దాదాపు 7,696 చదరపు అడుగుల భారీ వైశాల్యంలో విస్తరించి ఉంది. అంతే కాదు...

ఆ థియేటర్‌లో 363 రెక్లైనర్ సీట్లు ఉన్నాయి. హైదరాబాద్‌లో



అంత కంటే పెద్ద స్క్రీన్ ఏర్పాటు చేయడానికి చిరంజీవి - ఏసియన్ సినిమాస్ సంస్థ రెడీ అవుతోందని సమాచారం. సేమ్ అటువంటి స్క్రీన్ లేదంటే దాని కంటే ఒక్క ఇంచ్ ఎక్కువ ఉన్న స్క్రీన్ ఏర్పాటుకు సన్నాహాలు మొదలు అయ్యాయి.చిరంజీవి - ఏసియన్ సినిమాస్ సంస్థ భాగస్వామ్యంలో ఏర్పాటు కాబోయే స్క్రీన్‌కు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో అధికారికంగా వెల్లడించనున్నారు. అది గనుక రెడీ అయితే... ఇండియాలో మాత్రమే కాదు, ప్రపంచంలో హైదరాబాద్ సిటీకి ప్రత్యేక గుర్తింపు వస్తుంది.

# నల్లేరు మీద నడక అవుతుందా...?



హైదరాబాద్, : తెలంగాణ హైకోర్టు అనర్హత వేటు తీర్పుపై సుప్రీంకోర్టుకు వెళ్లారు దానం నాగేందర్. అయితే ఆయన మొదట సుప్రీంకోర్టుకు వెళ్లనని ఖైరతాబాద్ ఉపఎన్నికను నేరుగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. కానీ ఓ చాయిస్ ఉన్నప్పుడు ఎందుకు వదులుకోవడం ఆయన పిటిషన్ వేశారు కానీ..సుప్రీంకోర్టులో ఊరట లభించడం కష్టమేనన్న అభిప్రాయంబలంగా ఉంది. చట్టపరంగా అనర్హత వేటు పడినప్పటికీ, తదుపరి జరిగే ఉపఎన్నికలో పోటీ చేయకుండా నిరోధించే నిబంధన ఏదీ లేదు కాబట్టి దానం నాగేందర్ కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగడం దాదాపు ఖాయమైంది. ఈ పరిణామంతో ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఉపఎన్నిక అనివార్యం కాగా, ఇక్కడ రాజకీయ పరిస్థితులు పూర్తిగా దానం నాగేందర్ చుట్టూనే తిరుగుతున్నాయి. ఖైరతాబాద్ నియోజకవర్గ చరిత్రను పరిశీలిస్తే.. పార్టీల సిద్ధాంతాల కంటే దానం నాగేందర్ వ్యక్తిగత ప్రభావమే ఇక్కడ ఎక్కువ పనిచేస్తుందని స్పష్టమవుతోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఏవైనా సరే.. నియోజక వర్గంలోని ప్రతి బస్తీ, డివిజన్ స్థాయి నేతలతో ఆయనకు దశాబ్దాలుగా ఉన్న ప్రత్యక్ష పరిచయాలు, బలమైన అనుచరగణమే ఆయన ప్రధాన బలం. ఖైరతాబాద్‌లో ప్రత్యేకంగా ఏ ప్రతిపక్ష పార్టీకీ బలమైన సంస్థాగత క్యాడర్ నిర్మాణం లేకపోవడంతో, దానం నెట్‌వర్కే ప్రధాన శక్తిగా నిలుస్తోంది. ఇక పార్టీల సమీకరణాల పరంగా చూస్తే, అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఖైరతాబాద్‌తో సంప్రదాయబద్ధంగా పాత ఓటుబ్యాంకు ఉంది. దానం నాగేందర్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీకి దిగినప్పుడు.. ఆయన వ్యక్తిగత ఇమేజ్, బస్తీల్లో ఉన్న పట్టుకు తోడు కాంగ్రెస్ పార్టీ సంప్రదాయ ఓటుబ్యాంకు, శ్రేణులు ఏకమవుతాయి. దీనికి తోడు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ యంత్రాంగం, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల హోదా తోడవటం దానం నాగేందర్‌కు ఉపఎన్నికలో భారీ అడ్వాంటేజ్‌గా మారే అవకాశం ఉందనేది పొలిటికల్ ట్రెండ్స్ చెబుతున్నాయి.ఈ పరిస్థితి ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు అతిపెద్ద సవాలుగా మారింది. ఖైరతాబాద్‌లో స్థానికంగా దానం స్థాయి బలమైన, నియోజకవర్గమంతా తెలిసి ఉన్న ప్రత్యామ్నాయ నాయకుడు బీఆర్ఎస్‌కు లేకపోవడం పెద్ద లోటు. గతంలో దానంను నమ్ముకునే అక్కడ బీఆర్ఎస్ రాజకీయం నడిచింది. ఇప్పుడు ఆయననే ఎదుర్కొని నిలబడటానికి బలమైన లోకల్ క్యాడర్, సమర్థుడైన అభ్యర్థి దొరకడం గులాబీ పార్టీకి కత్తిమీద సాము లాంటిదే. ప్రభుత్వ బలం, దానం పర్సనల్ క్యాడర్‌ను తట్టుకుని పోరాడటం బీఆర్ఎస్‌కు అంత తేలికైన విషయం కాదుమరోవైపు భారతీయ జనతా పార్టీ పరిస్థితి కూడా ఇక్కడ ఏమంత ఆశాజనకంగా లేదు.

గతంలో తెలుగుదేశం పార్టీ తో పొత్తు ఉన్న సమయంలో మాత్రమే బీజేపీ ఈ నియోజకవర్గంలో విజయం సాధించగలిగింది. ఆ తర్వాత ఒంటరిగా పోటీ చేసిన ప్రతిసారి డిపాజిట్ కోల్పోవడం లేదా నామమాత్రపు ఓట్లకే పరిమితమవ్వడం జరిగింది.

నగర పరిధిలో ఉనికి ఉన్నప్పటికీ, ఖైరతాబాద్‌లోని స్థానిక బస్తీ ఓటర్లను ఆకట్టుకునే స్థాయి బలమైన కేడర్ గానీ, అభ్యర్థి గానీ బీజేపీకి కూడా పెద్దగా అందుబాటులో లేరు. ఖైరతాబాద్ ఉపఎన్నిక అనివార్యమైన వేళ, మిగిలిన ప్రతిపక్ష పార్టీల వద్ద గట్టి అభ్యర్థులు, బలమైన క్యాడర్ లేకపోవడం దానం నాగేందర్‌కు ప్లస్ పాయింట్‌గా మారుతోంది. చట్టపరమైన తీర్పు దానంకు ప్రతికూలంగా వచ్చినా, ప్రజాక్షేత్రంలో మాత్రం అధికార పార్టీ బలం, తన సొంత ఇమేజ్, స్థానిక బస్తీ ఓటర్ల మద్దతుతో ఆయన మరోసారి విజయం సాధించే అవకాశాలే మెండుగా ఉన్నాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# సింగిల్ విండో అనుమతులు కోసం యత్నాలు

హైదరాబాద్, : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ , నూతన హెచ్ఎండీఏ పరిధిలో భవన నిర్మాణ అనుమతులు, లేఅవుట్ అప్రూవల్స్ ప్రక్రియను మరింత సరళతరం చేయాలని రియల్ ఎస్టేట్ రంగానికి చెందిన ప్రముఖ అసోసియేషన్లు ప్రభుత్వాన్ని గట్టిగా కోరుతున్నాయి. ప్రస్తుతం వివిధ విభాగాల నుంచి ఎన్ఓసీలు పొందడంలో జరుగుతున్న జాప్యం, వివిధ శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగా ప్రాజెక్టుల నిర్మాణం ఆలస్యమవుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో అక్రమాలను అరికడుతూ, పూర్తి పారదర్శకతతో కూడిన సేవలు అందించేందుకు ఒక సమగ్ర సింగిల్ విండో వ్యవస్థను తక్షణమే అమల్లోకి తేవాలని డిమాండ్ చేస్తూ వస్తున్నాయి.ప్రస్తుతం అమల్లో ఉన్న ఆన్‌లైన్ అనుమతుల విధానం కొన్ని వెసులుబాట్లు కల్పిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఇంకా అనేక సాంకేతిక , అధికారిక ఇబ్బందులు వేధిస్తున్నట్లు డెవలపర్లు వాపోతున్నారు. ఫైళ్లు వివిధ శాఖల చుట్టూ తిరగడం వల్ల వడ్డీ భారం పెరిగి, చివరికి అది ఇళ్ల కొనుగోలుదారులపై అదనపు ఆర్థిక భారంగా మారుతోందని నిపుణులు చెబుతున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా అన్ని రకాల క్లియరెన్స్‌లను ఒకే గొడుగు కిందకు తెచ్చే సరికొత్త సింగిల్ విండో విధానం అత్యవసరమని రియల్ ఎస్టేట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.ఈ ప్రతిపాదిత సింగిల్ విండో వ్యవస్థ ద్వారా దరఖాస్తు చేసుకున్న నిర్దిష్ట కాలపరిమితిలోగా అన్ని అనుమతులు మంజూరయ్యేలా నిబంధనలు రూపొందించాలని కోరుతున్నారు. ఫైర్ సేఫ్టీ, రెవెన్యూ, అటవీ, పర్యావరణం , స్థానిక పట్టణాభివృద్ధి సంస్థల నుంచి వేర్వేరుగా అనుమతులు తెచ్చుకునే నరకయాతన తప్పుతుందని, దీనివల్ల చిన్న , మధ్యతరగతి బిల్డర్లకు ఎంతో ఊరట లభిస్తుందని పేర్కొంటున్నారు. పారదర్శకత పెరిగితే ప్రభుత్వానికి వచ్చే ఆదాయంతో పాటు వినియోగదారులకు కూడా సరసమైన ధరల్లో గృహాలు లభించే అవకాశం ఉంటుందని వాదిస్తున్నారు.తెలంగాణ ప్రభుత్వం, సంబంధిత పురపాలక శాఖ ఈ డిమాండ్లపై సానుకూలంగా స్పందించి, రియల్ ఎస్టేట్ రంగానికి మరింత ఊతమిచ్చేలా నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు. అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్ నగర బ్రాండ్ ఇమేజ్ వేగంగా మారుతున్న తరుణంలో, మౌలిక సదుపాయాల కల్పనలో , అనుమతుల జారీలో ఈ రకమైన ఆధునిక సంస్కరణలు ఎంతైనా అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. ప్రభుత్వం కనుక సింగిల్ విండో విధానాన్ని పకడ్బందీగా అమలు చేస్తే, దేశవ్యాప్తంగా ఉన్న పెద్ద ఇన్వెస్టర్లు మరెన్నో ప్రాజెక్టులతో భాగ్యనగరం వైపు క్యూ కట్టే అవకాశం ఉంది.

# ఖైరతాబాద్ నుంచి సాయికిరణ్..!

హైదరాబాద్, : తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం ఖైరతాబాద్ నియోజకవర్గం ఉపఎన్నిక వ్యవహారం కీలక చర్చనీయాంశంగా మారింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించిన దానం నాగేందర్.. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండానే కాంగ్రెస్‌లో చేరారు. సికింద్రాబాద్ లోక్‌సభ నియోజక వర్గానికి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. పార్టీ మారిన ఆయనను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటించాలని బీఆర్ఎస్ న్యాయ పోరాటం చేసింది. చివరకు ఆయనపై తెలంగాణ హైకోర్టు అనర్హత వేటు వేస్తూ తీర్పు ఇచ్చింది.హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ దానం నాగేందర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఇవాళ లేదంటే రేపు సుప్రీంకోర్టులో తీర్పు వచ్చే అవకాశం ఉంది. అయితే, హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు సమర్థించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పలువురు న్యాయనిపుణులు పేర్కొంటున్నారు. అదే జరిగితే ఖైరతాబాద్ ఉపఎన్నిక అనివార్యమైనట్లే. ఇప్పటికే బీఆర్ఎస్ అధిష్టానం ఖైరతాబాద్ నియోజకవర్గంపై దృష్టిసారించింది. ఉపఎన్నిక వస్తే బరిలో ఎవరిని నిలపాలనే అంశంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ముఖ్యనేతలతో చర్చించినట్లు సమాచారంఖైరతాబాద్ ఉప ఎన్నికల్లో విజయం సాధించి అధికార కాంగ్రెస్ పార్టీకి గట్టి షాక్ ఇవ్వాలని బీఆర్ఎస్ భావిస్తోంది. ఈ క్రమంలో అభ్యర్థి ఎంపికపై ఆచితూచి అడుగులు వేయాలని గులాబీ పార్టీ అధిష్టానం డిసైడ్ అయింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్‌లో ఖైరతాబాద్ టికెట్ ఆశిస్తున్న నేతలు.. ఎవరి ప్రయత్నాల్లో వాళ్లు బిజీ అయిపోయారు. ప్రముఖంగా పీజేఆర్ తనయుడు విష్ణువర్ధన్ రెడ్డి, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, మన్నె గోవర్ధన్ రెడ్డి, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తనయుడు సాయికిరణ్ యాదవ్ పేర్లు వినిపిస్తున్నాయి. అయితే, సాయికిరణ్ యాదవ్‌ను బరిలోకి దింపాలనే ఆలోచనలో బీఆర్ఎస్ అధిష్టానం ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. ఖైరతాబాద్ ఉ



ప ఎన్నికలో అభ్యర్థి ఎంపికపై కేసీఆర్ పార్టీ ముఖ్యనేతలతో చర్చించినట్లు సమాచారం. ఈ క్రమంలో తసాని శ్రీనివాస్ యాదవ్ కుమారుడు సాయి కిరణ్ కు టికెట్ ఇవ్వాలని కేసీఆర్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో తసాని శ్రీనివాస్ యాదవ్ కు ఫోన్ చేసి ఖైరతాబాద్ ఉప ఎన్నికలో సాయికిరణ్ ను పోటీకి పెట్టేందుకు సిద్ధం కావాలని కేసీఆర్ సూచించినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతుంది. సాయికిరణ్ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత జరిగిన తొలి లోక్ సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యాడు. గత ఎన్నికల్లోనూ అదే పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేయాలని భావించినప్పటికీ.. చివరి నిమిషంలో అధిష్టానం ఆ స్థానం నుంచి పద్మారావుగౌడ్ ను బరిలోకి దింపింది. అయితే, తలసాని శ్రీనివాస్ యాదవ్ కు ఖైరతాబాద్ నియోజకవర్గంలో గట్టి పట్టుంది. మంత్రిగా ఈ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనుల్లో తలసాని కీలకంగా వ్యవహరించడం కలిసి వస్తుందని బీఆర్ఎస్ అధిష్టానం భావిస్తోంది. దీనికితోడు తలసాని సామాజిక వర్గంకు చెందిన ఓటర్లతోపాటు ఇతర బీసీ సామాజిక వర్గానికి చెందిన ఓటర్లు ఈ నియోజకవర్గంలో ఎక్కువగా ఉండటంతోపాటు.. వీరిలో ఎక్కువశాతం తలసాని కుటుంబానికి సానుకూలంగా ఉండటంతో బీఆర్ఎస్ అధిష్టానం సాయికిరణ్‌ను బరిలోకి దింపేందుకు సిద్ధమైనట్లు సమాచారం.

# ఇండియా నుంచి భారత్

హైదరాబాద్, : దేశ రాజకీయాల్లో కొన్ని నాయకత్వాలు ఎన్నికల విజయాలతో గుర్తుండిపోతాయి. మరికొన్ని నాయకత్వాలు పాలనా విధానాల్లో, ప్రజల ఆలోచనా ధోరణిలో తీసుకొచ్చిన మార్పులతో చరిత్రలో నిలిచిపోతాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాజకీయ ప్రస్థానాన్ని పరిశీలిస్తే.. రెండో కోణం కూడా స్పష్టంగా కనిపిస్తుంది. ప్రధాని పదవి అంటే కేవలం ప్రభుత్వాన్ని నడపడం మాత్రమే కాదనే భావనను మోదీ తన పనితీరుతో ముందుకు తెచ్చారు. ప్రభుత్వ కార్యక్రమాలు, దేశ పర్యటనలు, సమీక్షలు, అంతర్జాతీయ సమావేశాలు, ప్రజా కార్యక్రమాలు.. ఇలా నిరంతర కార్యకలాపాలతో ఆయన రాజకీయ జీవితాన్ని కొనసాగిస్తున్నారు. వ్యక్తిగత ఆరోగ్యంపై పెద్దగా చర్చకు తావివ్వకుండా విధులకు ప్రాధాన్యం ఇవ్వడం ఆయన నాయకత్వ శైలిలో కనిపించే అంశం.మోదీ పాలనలో మరో ముఖ్యమైన అంశం.. సంప్రదాయ రాజకీయాలను అభివృద్ధి, సంక్షేమం, సామాజిక మార్పుతో అనుసంధానం చేయడం. స్వచ్ఛ భారత్, యోగా, పర్యావరణ పరిరక్షణ, డిజిటల్ సాంకేతికత, పేదల కోసం వివిధ సంక్షేమ కార్యక్రమాలు వంటి అంశాలను ప్రభుత్వ కార్యక్రమాలుగా మాత్రమే కాకుండా ప్రజా ఉద్యమాలుగా మలిచేందుకు ప్రయత్నించారు. ప్రజల భాగస్వామ్యంతోనే దేశ ప్రగతి సాధ్యమనే సందేశాన్ని పదేపదే ముందుకు తెచ్చారు.దేశ ప్రయోజనమే ముందన్న భావనను ప్రజల్లో బలపరచడం కూడా మోదీ రాజకీయ శైలిలోని ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు.

వ్యక్తి కంటే దేశం, రాజకీయాల కంటే జాతీయ ప్రయోజనం, హక్కులతో పాటు బాధ్యతలు అనే అంశాలను ఆయన ప్రసంగాల్లోనూ, కార్యక్రమాల్లోనూ ప్రస్తావిస్తూ వచ్చారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో కనిపించిన దేశభక్తి, జాతీయ పునర్నిర్మాణ స్ఫూర్తిని కొత్త తరానికి పరిచయం చేసే ప్రయత్నం కూడా ఇందులో భాగమే.'ఇండియా' నుంచి 'భారత్' వైపు సాగుతున్న చర్చ కూడా ఈ మారుతున్న ఆలోచనా ధోరణికి ఒక ప్రతీకగా మారింది. ఇది కేవలం పేరుకు సంబంధించిన మార్పు కాదు.. దేశపు సాంస్కృతిక మూలాలు, చారిత్రక వారసత్వం, భారతీయ జీవన విధానంపై పెరుగుతున్న దృష్టికి ప్రతిబింబంగా చూడవచ్చు. ఈ పరివర్తనలో మోదీ నాయకత్వం ఒక ముఖ్యమైన పాత్ర పోషించిందనే అభిప్రాయం బలంగా వినిపిస్తోంది.

## అమృతం 'చెరకు రసం'.. డీహైడ్రేషన్ కు చెక్ పెట్టాలంటే ఇది తాగాల్సిందే!



వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు పెరిగే కొద్దీ శరీరాన్ని చల్లబరచేందుకు చాలా మంది సహజంగానే చల్లని పానీయాలవైపు మొగ్గు చూపుతారు. నిమ్మరసం (నీంబూ పానీ), చల్లని లస్సీలు వంటి సంప్రదాయ పానీయాలు తక్షణ ఉపశమనం ఇస్తాయని భావిస్తారు. ఈ జాబితాలో చెరకు రసం (షుగర్‌కేన్ జ్యూస్) కూడా ప్రముఖంగా ఉంటుంది. ఇది సహజంగా తీయగా, తాజాగా అనిపించడంతోపాటు శరీరాన్ని చల్లబరుస్తుందని చాలామంది నమ్మకం. అయితే తీవ్రమైన ఎండలో ఇది నిజంగా హీట్ స్ట్రోక్‌ను నివారిస్తుందా? శరీరానికి అవసరమైన హైడ్రేషన్‌ను అందిస్తుందా? అనే విషయాలపై చెరకు రసం గురించి కొన్ని అపోహలు ఉన్నాయి. వాటిని వైద్యులు వివరిస్తున్నారు. హైడ్రేషన్ జరుగుతుందా..హీట్ స్ట్రోక్ అనేది శరీరం తన ఉష్ణోగ్రతను నియంత్రించలేని ప్రమాదకర పరిస్థితి. ఇది ముఖ్యంగా డీహైడ్రేషన్, ఎలక్ట్రోలైట్ లోపం వల్ల వస్తుంది. చెరకు రసం తాగితే చల్లగా అనిపించినా, ఇది హీట్ స్ట్రోక్‌ను నివారించడానికి అవసరమైన ముఖ్య పోషకాలను అందించదు. చెరకు రసం ఎలక్ట్రోలైట్ డ్రింక్‌లా పనిచేస్తుందని ఒక పెద్ద అపోహ ఉంది. వాస్తవానికి చెమట ద్వారా శరీరం ఒక లీటర్‌కు సుమారు 900 మిల్లీగ్రాముల సోడియంను కోల్పోతుంది.

సోడియం శరీరంలో నీటిని నిల్వ ఉంచడంలో కీలకం. ఇది తక్కువగా ఉంటే హైడ్రేషన్ పూర్తిగా జరగదు. అందుకే చెరకు రసం తాగడం అంటే అసలు శరీరాన్ని హైడ్రేట్ చేయడం కాకుండా చక్కెర నీరు తాగినట్లే అవుతుందని నిపుణులు చెబుతున్నారు. దీనికంటే కొంచెం ఉప్పు కలిపిన నిమ్మరసం తాగడం ఎంతో మేలు చేస్తుంది.అధికంగా చక్కెర..ఇంకో ముఖ్య అంశం చక్కెర పరిమాణం. ఒక గ్లాస్ చెరకు రసంలో సుమారు 25 నుంచి 40 గ్రాముల వరకు చక్కెర ఉంటుంది. ఇది రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను ఒక్కసారిగా పెంచే ప్రమాదం ఉంటుంది. ముఖ్యంగా ఖాళీ కడుపుతో తాగితే ఇది మరింత ప్రభావం చూపుతుంది. తాత్కాలికంగా శక్తి ఇచ్చినా, దీర్ఘకాలికంగా హైడ్రేషన్‌కు పెద్దగా సహాయపడదు. హైజీన్ కూడా చెరకు రసం విషయంలో పెద్ద సమస్యగా మారుతుంది. రోడ్డుపై అమ్మే జ్యూస్ స్టాళ్లు ఎక్కువసేపు ఎండలో ఉంటాయి. వాడే ఐస్ కూడా శుద్ధి చేసిన నీటితో తయారై ఉండదు. ఈ కారణాల వల్ల ఈ.కోలి, టైఫాయిడ్, జాండిస్ వంటి ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉంటుంది.ఉప్పు, నిమ్మరసం కలిపిన నీళు బెటర్..అయితే వేసవిలో ఏం తాగాలి? అంటే.. నిపుణుల సూచన ప్రకారం సాదాసీదా నీరు అత్యుత్తమం.

## 14 రోజులపాటు రోజూ ఒక కోడిగుడ్డును తింటే శరీరంలో కనిపించే మార్పులు ఇవే..!



గుడ్లు రోజువారీ ఆహారంలో అత్యంత సాధారణంగా ఉపయోగించే పదార్థాల్లో ఒకటి. వీటిని తేలికగా వండుకోవచ్చు, ఎన్నో వంటకాలతో కలిపి తినవచ్చు, ముఖ్యంగా ప్రోటీన్ కోసం చాలా మంది గుడ్లపై ఆధారపడుతుంటారు. కొందరికి ఇవి ప్రతి రోజు బ్రేక్‌ఫాస్ట్‌లో తప్పనిసరి కాగా, మరికొందరికి కొలెస్ట్రాల్ గురించి సందేహాలు ఉంటాయి. అయితే గుడ్లు కేవలం సులభమైన ఆహారమే కాదు, ఇవి శరీరానికి అవసరమైన అనేక పోషకాలను కలిగి ఉంటాయి. మెదడు పనితీరు, శక్తి స్థాయిలు, చర్మం, జుట్టు, కంటి ఆరోగ్యం వంటి అంశాల్లో కూడా గుడ్లు ముఖ్య పాత్ర పోషిస్తాయి. ఇక 14 రోజుల పాటు గుడ్లను ప్రతిరోజూ తింటే శరీరంలో కొన్ని మార్పులు కనిపిస్తాయని నిపుణులు తెలియజేస్తున్నారు.

మెదడు పనితీరుకు, కళ్ల ఆరోగ్యానికి..

మొదటగా మెదడు పనితీరు మెరుగుపడుతుంది. గుడ్లలో కోలిన్ అనే పోషకం అధికంగా ఉంటుంది. ఇది మెదడులో అసెటైల్కోలిన్ అనే న్యూరోట్రాన్స్‌మిటర్ తయారీలో సహాయపడుతుంది. ఇది జ్ఞాపకశక్తి, ఏకాగ్రతను మెరుగుపరచడంలో సహకరిస్తుంది. రెండవది, కొలెస్ట్రాల్ సమతుల్యం మెరుగుపడే అవకాశం ఉంటుంది. గుడ్లు కొలెస్ట్రాల్ పెంచుతాయని భావన ఉన్నప్పటికీ, చాలా మందిలో ఇవి హెచ్‌డీఎల్ (మంచి కొలెస్ట్రాల్) స్థాయిలని పెంచడంలో సహాయపడతాయని నిపుణులు చెబుతున్నారు. ఇది గుండె ఆరోగ్యానికి ఉపయోగకరం. మూడవది, కంటి ఆరోగ్యానికి గుడ్లు మేలు చేస్తాయి. గుడ్ల పచ్చసొనలో లుటీన్, జియాజాంతిన్ అనే యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి హానికరమైన బ్లూ లైట్ నుంచి కళ్లను రక్షించడంలో సహాయపడతాయి. దీర్ఘకాలికంగా కంటి ఆరోగ్యాన్ని కాపాడుతాయి.

జుట్టు, చర్మం సంరక్షణకు..

నాలుగవది, జుట్టు, చర్మం, గోర్లు ఆరోగ్యంగా ఉండటానికి గుడ్లు సహాయపడతాయి. గుడ్లలో సల్ఫర్ కలిగిన అమినో ఆమ్లాలు ఉంటాయి. ఇవి కెరాటిన్ అనే ప్రోటీన్ తయారీలో కీలక పాత్ర పోషిస్తాయి. దీంతో జుట్టు బలంగా, చర్మం ఆరోగ్యంగా, గోర్లు దృఢంగా మారుతాయి. ఇలా 14 రోజుల పాటు గుడ్లు తీసుకోవడం వల్ల శరీరంలో అనేక మంచి మార్పులు జరుగుతాయి. ఇక గుడ్లు తినని వారు కూడా ప్రత్యామ్నాయంగా కొన్ని ఆహారాలను తీసుకోవచ్చు. వెజిటేరియన్ల కోసం సోయా ఆధారిత ఆహారాలు మంచి ఎంపిక అని నిపుణులు సూచిస్తున్నారు.

## పేగుల్లో మంచి బ్యాక్టీరియా: కేవలం జీర్ణక్రియకే కాదు.. ఈ ఆరోగ్య ప్రయోజనాల కోసం కూడా తప్పనిసరి!



పేగుల్లో మంచి బ్యాక్టీరియా కేవలం జీర్ణ వ్యవస్థకే కాదు, వీటికి కూడా అవసరమే..! ఇప్పటికే చాలా మందికి ప్రోటీన్ తీసుకోవడం, స్ట్రెంగ్త్ ట్రైనింగ్, ఎక్కువ కాలరీలు తీసుకోవడం కండరాల పెరుగుదలకు ముఖ్యమని తెలుసు. అయితే, ఇటీవల జరిగిన ఒక అధ్యయనం కండరాల శక్తి, శారీరక పనితీరును ప్రభావితం చేసే మరో ముఖ్య అంశాన్ని గుర్తించింది. పేగుల్లో మంచి బ్యాక్టీరియా కేవలం జీర్ణ వ్యవస్థకే కాదు, వీటికి కూడా అవసరమే..!ఇప్పటికే చాలా మందికి ప్రోటీన్ తీసుకోవడం, స్ట్రెంగ్త్ ట్రైనింగ్, ఎక్కువ కాలరీలు తీసుకోవడం కండరాల పెరుగుదలకు ముఖ్యమని తెలుసు. అయితే, ఇటీవల జరిగిన ఒక అధ్యయనం కండరాల శక్తి, శారీరక పనితీరును ప్రభావితం చేసే మరో ముఖ్య అంశాన్ని గుర్తించింది. పేగుల్లో ఉండే ఒక ప్రత్యేకమైన మంచి బ్యాక్టీరియా కండరాల బలం పెంచడంలో నేరుగా సహాయపడుతుందని ఈ పరిశోధన వెల్లడించింది. ఇది గట్-మసిల్ యాక్సిస్ అనే కొత్త భావనకు బలమైన ఆధారాలను అందిస్తోంది. అంటే పేగులలోని సూక్ష్మజీవుల వాతావరణం కండరాల పనితీరును ప్రభావితం చేస్తుంది. గట్-మసిల్ యాక్సిస్ అనేది జీర్ణవ్యవస్థ (గాస్ట్రోఇంటెస్టైనల్ ట్రాక్ట్), కండరాల మధ్య ఉండే ద్విముఖ సంబంధం. పేగుల ఆరోగ్యం కండరాల పరిమాణం, పనితీరును ప్రభావితం చేస్తుంది. అదే సమయంలో శారీరక వ్యాయామం కూడా పేగులలోని మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందేందుకు దోహదపడుతుంది.గట్ అనే జర్నల్‌లో ప్రచురితమైన ఈ అధ్యయనం ప్రకారం రోసిబ్యూరియా ఇనులినివోరాన్స్ అనే మంచి బ్యాక్టీరియా కండరాల పనితీరుకు సహజ బూస్టర్‌లా పనిచేస్తుందని వెల్లడైంది. ఇది కేవలం ఆహారాన్ని జీర్ణం చేయడమే కాకుండా, కండరాలు నిర్మాణం అయ్యేందుకు, సమర్థవంతంగా పనిచేయడానికి సంకేతాలు పంపుతుంది. ఇక ఈ పరిశోధనల్లో కొన్ని ముఖ్యాంశాలను కూడా పరిశోధకులు గుర్తించారు.

వృద్ధుల్లో ఈ బ్యాక్టీరియా ఎక్కువగా ఉన్నవారికి హ్యాండ్‌గ్రిప్ శక్తి దాదాపు 30 శాతం ఎక్కువగా కనిపించిందని గుర్తించారు. యువతలో ఈ బ్యాక్టీరియా శక్తి మాత్రమే కాకుండా స్టామినా పెరుగుదలతో కూడా సంబంధం కలిగి ఉంది. ఎలుకలపై చేసిన పరీక్షల్లో

ఈ బ్యాక్టీరియా ఇచ్చిన గ్రూప్‌లో గ్రిప్ శక్తి 30 శాతం పెరిగింది. మనుషుల్లో కూడా ఈ బ్యాక్టీరియా అధికంగా ఉన్నవారికి లెగ్ ప్రెస్, బెంచ్ ప్రెస్ వంటి వ్యాయామాల్లో మెరుగైన ఫలితాలు కనిపించాయి. కండరాలకు శక్తిని ఇస్తుంది..ఇక ఈ బ్యాక్టీరియా శరీరంలో అమినో ఆమ్లాల వినియోగాన్ని మార్చుతుంది. ఇది కండరాలకు అవసరమైన శక్తి మార్గాలను యాక్టివేట్ చేసి, కండర కణాలు అధిక శక్తిని ఉత్పత్తి చేసుకునేలాసహాయప డుతుంది. సాదారణంగా చెప్పాలంటే ఇది కండరాలకు ఇంధనం అందించే విధానాన్ని మెరుగుపరుస్తుంది.

## ముఖంపై వాపుతో ఇబ్బంది పడుతున్నారా? కారణాలు మరియు నివారణ మార్పులు ఇవే!



ఇంటర్నెట్‌లో ప్రస్తుతం రిలాక్సింగ్ ఫేస్ మసాజ్ వీడియోలు విపరీతంగా వైరల్ అవుతున్నాయి. అలాగే ముఖంలో వచ్చే ఇన్ఫ్లమేషన్ (వాపు) తగ్గిస్తాయని చెప్పే హెర్బల్ షాట్స్ కూడా చాలామంది ఉపయోగిస్తున్నారు. ఇన్ఫ్లమేషన్ అనేది శరీరంలోని రోగనిరోధక వ్యవస్థ గాయాలు లేదా ఇన్‌ఫెక్షన్లకు ప్రతిస్పందనగా వచ్చే సహజ ప్రక్రియ. అయితే ఇది ఎక్కువకాలం కొనసాగితే హృదయ రోగాలు,

మధుమేహం, ఆటో ఇమ్యూన్ వ్యాధులు, క్యాన్సర్ వంటి తీవ్రమైన సమస్యలకు దారితీసే అవకాశం ఉంటుంది. అదే విధంగా ముఖంపై వచ్చే ఇన్ఫ్లమేషన్ వల్ల ఎర్రబడటం, వాపు, పఫ్‌నెస్ వంటి లక్షణాలు కనిపించి రూపాన్ని ప్రభావితం చేస్తాయి. ముఖంపై ఇన్ఫ్లమేషన్ ఎక్కువకాలం కొనసాగితే ఇన్ఫ్లమేజింగ్ అనే పరిస్థితి ఏర్పడుతుంది. దీని వల్ల కొల్లాజెన్, ఎలాస్టిన్ వంటి ముఖ్యమైన ప్రోటీన్లు దెబ్బతిని చర్మం ముందుగానే ముడతలు పడటం, వదులుగా మారటం, చర్మ రంగు అసమానంగా మారటం జరుగుతుంది.

## ఆసక్తికర 'మిస్సింగ్ మేఘన'



మర్డర్ మిస్టరీ థ్రిల్లర్ సినిమాలను ఇష్టపడే సినీ ప్రియుల కోసం మరో ఆసక్తికరమైన చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. వాచ్చాస్పతీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న లేటెస్ట్ సస్పెన్స్ థ్రిల్లర్ మూవీ 'మిస్సింగ్ మేఘన'. రామ్ కార్తిక్, వైదికా సెంజాలియా, అంకిత్ కొయ్యా, అమ్ము అభిరామి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని ఫస్ట్ కాపీ మూవీస్, కేడి కంపెనీ బ్యానర్స్‌పై ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ మూవీని సెప్టెంబర్ 18న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయడానికి సర్వం సిద్ధం చేశారు. ఇక విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో మేకర్స్ ప్రమోషన్ల వేగాన్ని పెంచారు. ఈ నేపథ్యంలో.. సినిమాపై మరిన్ని అంచనాలు పెంచేలా చిత్రబృందం ఒక బిగ్ అప్డేట్‌ను ప్రకటించింది. 'మిస్సింగ్ మేఘన' అధికారిక ట్రైలర్‌ను ఉదయం 11:34 గంటలకు విడుదల చేయబోతున్నట్లు అధికారికంగా వెల్లడించారు. ఈ ట్రైలర్ అప్డేట్ సందర్భంగా విడుదల చేసిన కొత్త పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో విశేషంగా ఆకట్టుకుంటోంది. ఇందులో నటి అమ్ము అభిరామి చేతిలో టార్చ్ లైట్ పట్టుకుని ఎంతో షాకింగ్‌గా చూస్తుండటం కనిపిస్తుంది. ఆమె వెనుక ఉన్న బోర్డ్‌పై కొంతమంది వ్యక్తుల ఫొటోలు, పాత న్యూస్ పేపర్ క్లిప్పింగ్స్ ఉండటంతో సినిమా కథపై ప్రేక్షకుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

## ఆకట్టుకుంటున్న 'ఇడుపు కాయితం' వీడియో




ప్రియదర్శి హీరోగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'ఇడుపు కాయితం'. ఈ సినిమాలో తెలంగాణ ఫోక్ సాంగ్స్ ద్వారా పేరు తెచ్చుకున్న నటి నాగదుర్గ హీరోయిన్‌గా నటిస్తోంది. తెలంగాణ ఫ్యామిలీ బ్యాక్ డ్రాప్ స్టోరీతో ఎంటర్ టైనింగ్ డ్రామాగా యువ దర్శకుడు వంశీరెడ్డి దొండపాటి రూపొందిస్తున్నారు. ప్రొడ్యూసర్ బన్నీ వాస్, జీనియస్ డైరెక్టర్ సుకుమార్ తమ బన్నీ వాస్ వర్క్స్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్స్ పై నిర్మించారు. ప్రస్తుతం రెగ్యులర్ షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా నుంచి 'శ్రీలత..' సాంగ్ రిలీజ్ చేశారు మేకర్స్. 'శ్రీలత..' సాంగ్ లో హీరో ప్రియదర్శి, హీరోయిన్ నాగదుర్గ కెమిస్ట్రీ ఆకట్టుకుంటోంది.

## అలాంటి పాత్రలు చేసి డబ్బు సంపాదించాల్సిన అవసరం నాకు లేదు...



నేచురల్ బ్యూటీగా టాలీవుడ్ ఇండస్ట్రీ ఫుల్ క్రేజ్ తెచ్చుకున్న సాయి పల్లవి.. ప్రస్తుతం తెలుగుతో పాటు బాలీవుడ్‌లో కూడా పలు ప్రాజెక్టులు చేస్తూ బిజీగా ఉంటుంది. ఇదిలా ఉంటే.. తాజా ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈ హీరోయిన్ కిస్సింగ్ సీన్స్‌పై ఆసక్తికర కామెంట్స్ చేసింది. 'చాలా మంది డైరెక్టర్స్ నేను ముద్దు సన్నివేశాల్లో నటించనని తెలిసినా ఇప్పటికీ అడుగుతూనే ఉంటారు. ఒకవేళ నాకు ఒక భాగస్వామి (బాయ్ ఫ్రెండ్) ఉంటే అప్పుడు యాక్టింగ్ అయినా మరేది అయినా వేరే ఒకరిని ముద్దు పెట్టుకోవడం కరెక్ట్ కాదు కదా. ఒక మంచి జీవితాన్ని గడపడానికి స్త్రీకి లేదా పురుషుడికి కావాల్సింది సంతోషకరమైన కుటుంబం. ఒక కారు, ఒక ఇల్లు మాత్రమే. ఇప్పటికే అవన్నీ నా దగ్గర ఉన్నాయి. కేవలం మరో కారు కొనడం కోసం నేను వేరొకరిని ముద్దు పెట్టుకోవాల్సిన అవసరం లేదు. నాకున్న దానితో నేను సంతోషంగా ఉన్నాను. నటన కోసం నన్ను సినిమాలో తీసుకోవాలనుకుంటే తీసుకోండి, కానీ సన్నిహిత సన్నివేశాల కోసం అయితే వేరే వారిని ఎంపిక చేసుకోండి. నాకు అందులో ఎలాంటి అభ్యంతరం లేదు' అంటూ చెప్పుకొచ్చింది. ప్రజెంట్ సాయి పల్లవి కామెంట్స్ వైరల్ అవుతుండగా.. 'డబ్బు కంటే విలువలకు ప్రాధాన్యతనిచ్చే వారిని చూడటం చాలా అరుదు' అంటూ ప్రశంసిస్తున్నారు అభిమానులు.

## చరిత్రతో కూడిన కథల్లో నటించడం సవాలుతో కూడుకున్నది



వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకులను అలరిస్తున్న యంగ్ బ్యూటీ సయూ మంజ్రేకర్, ప్రస్తుతం టాలీవుడ్ హీరో నిఖిల్ సిద్ధార్థ్ సరసన పాన్ ఇండియా మూవీ 'ఇండియా హౌస్'లో హీరోయిన్‌గా నటిస్తున్నారు. మెగాస్టార్ రామ్ చరణ్, యూవీ క్రియేషన్స్, విక్రమ్ రెడ్డి సంయుక్తంగా అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అయితే ఈ మూవీ షూటింగ్ ప్రారంభమై రెండేళ్లు పూర్తి కావొస్తున్నప్పటికీ విడుదల తేదీని ఖరారు చేసుకోలేదు. ఇదిలా ఉంటే.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సయూ మంజ్రేకర్ ఈ సినిమా విశేషాలు పంచుకుంటూ పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నిజమైన చరిత్ర ఆధారంగా తెరకెక్కుతున్న చిత్రాల్లో నటించడం ఎంతో గర్వంగా, వినమ్రంగా ఉంటుందని సయూ చెప్పారు. సాధారణ సినిమాల్లో అయితే మనకు నచ్చినట్లు నటించడానికి కొంత స్వేచ్ఛ ఉంటుందని, కానీ ఇలాంటి చారిత్రాత్మక కథల్లో మాత్రం బాధ్యత చాలా ఎక్కువగా ఉంటుందని తెలిపారు. 'ఇండియా హౌస్' సినిమా కేవలం పెద్ద పెద్ద సెట్స్, ఖరీదైన కాస్ట్యూమ్స్ కోసం మాత్రమే కాదని స్పష్టం చేశారు. ఈ చిత్రానికి అసలైన బలం అందులోని మానవీయ భావోద్వేగాలేనని అన్నారు. ఆ కాలంలోని మనుషుల మధ్య ఉండే అనుబంధాలు, వారి త్యాగాలు, కలల చుట్టూ ఈ కథ తిరుగుతుందని తెలిపారు. డైలాగ్స్, బాడీ లాంగ్వేజ్, దుస్తులు అన్నీ ఆ నాటి వాతావరణాన్ని కళ్లకు కట్టేలా ఉంటాయని చెప్పారు. సినిమాలు కేవలం కాలక్షేపం కోసం మాత్రమే కాకుండా, మన గతాన్ని, చరిత్రను ప్రేక్షకులకు గుర్తు చేసేలా ఉండాలని సాయి తెలిపారు. ఈ అద్భుతమైన ప్రాజెక్ట్‌లో భాగం కావడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. చరిత్రతో కూడిన కథల్లో నటించడం సవాలుతో కూడుకున్నదని అన్నారు.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja Publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215